

మల్లవల్లి.. విషంచల్లి..



మల్లవల్లిలోని ఇండస్ట్రియల్ ఏరియా

టీడీపీ హయాంలో మెగా పారిశ్రామికీకరణకు శ్రీకారం

- అశోక్ లేల్యాండ్, మోహన్ స్పిన్‌టెక్స్‌ల రాక
- 600కు పైగా ఎంఎస్ఎంఈలకు భూ కేటాయింపులు
- వైసీపీ వచ్చాక మారిపోయిన పరిస్థితి
- వరుస నోటీసులతో పరిశ్రమలకు చుక్కలు
- వందలాది సంస్థలకు భూ కేటాయింపులు రద్దు
- భూమి ధర పెంచేసి.. డబ్బు చెల్లించాలని వేధింపులు
- అనాథగా మిగిలిన ఇండస్ట్రియల్ ప్రాంతం
- బాధిత రైతులకు నష్టపరిహారంలోనూ తాత్సారం



అశోక్ లేల్యాండ్ పరిశ్రమ

పారిశ్రామిక ప్రాంతంలో ఐదేళ్లుగా వైసీపీ విధ్వంసం

భారీ పరిశ్రమలు, ఇండస్ట్రియల్ పార్కులు, మెగా ఫుడ్‌పార్కులతో గత టీడీపీ ప్రభుత్వంలో మల్లవల్లి కళకళలాడుతూ ఉండేది. వైసీపీ ఇలా వచ్చిందో లేదో ఆ పరిశ్రమలన్నీ నాశనమయ్యాయి. మెగా పారిశ్రామిక ప్రాంతం అనాథగా మిగిలిపోయింది. కొత్తగా ఏర్పడిన రాష్ట్రాన్ని పారిశ్రామికంగా వృద్ధి చెందాలనే తలంపుతో రాయితీలు కల్పించి టీడీపీ ప్రభుత్వం పరిశ్రమలు తీసుకురాగా, ఆ రాయితీలన్నీ తీసేసి వచ్చిన పరిశ్రమలన్నింటినీ సాగనంపింది వైసీపీ ప్రభుత్వం. చివరకు భూములిచ్చిన రైతులకు నష్టపరిహారం కూడా ఇవ్వకపోవడంతో పారిశ్రామికీకరణ ఐదేళ్లుగా ఒక్క అడుగు ముందుకు కదిలింది లేదు.

- విజయవాడ, ఆంధ్రజ్యోతి/హనుమాన్ జంక్షన్ రూరల్

మెగా ఫుడ్ పార్కును గాలికొదిలేశారు

కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన మెగా ఫుడ్‌పార్కును 100 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించారు. 58 ఎకరాల్లో కేంద్ర ప్రభుత్వ ఫుడ్‌పార్క్ ఏర్పాటు చేయగా, 42 ఎకరాల్లో రాష్ట్ర ప్రభుత్వం తమ బాధ్యతగా స్టేట్ మెగాపార్కును ఏర్పాటు చేసింది. ఇందులో పరిశ్రమల స్థాపన కోసం వైసీపీ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటైన ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు తప్ప కొత్తగా ఒక్కటంటే ఒక్క పరిశ్రమ రాలేదు.

మల్లవల్లి రైతుల ఉసురు తీశారు..!

భూముల విలువను అమాంతంగా పెంచిన వైసీపీ ప్రభుత్వం మల్లవల్లి రైతులకు నష్టపరిహారం మాత్రం ఇవ్వలేదు. మాయ జీవోలతో కాలం గడుపుతూ, చివరకు పక్కన పెట్టేసింది. దీంతో గత సంవత్సరం ఇదే సమయంలో మొదలైన మల్లవల్లి బాధితుల పోరాటం ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది. ఎమ్మెల్యే వల్లభనేని వంశీ సూచనలతో పోలీసులు మహిళా రైతులను అరెస్టులు కూడా చేసింది. ఒకానొక సమయంలో సంయమనం కోల్పోయిన రైతులు వీరవల్లి పోలీస్‌స్టేషన్ ముందు పురుగుమందు డబ్బాలతో ధర్నాకు దిగినా, జనసేన అధినేత పవన్ కల్యాణ్ వచ్చి రైతులకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చినా లాభం లేకుండాపోయింది. ఇప్పటికైనా ప్రభుత్వం మారితే పరిశ్రమలు పెరగడంతో పాటు నష్టపరిహారం చెల్లిస్తారని భూనిర్వాసితులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

టీడీపీ హయాంలో పరిశ్రమలొచ్చే..

రాష్ట్ర విభజన తర్వాత అమరావతి రాజధాని ప్రాంతాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలన్న ఉద్దేశంతో కిందటి టీడీపీ హయాంలో మల్లవల్లిలో ఇండస్ట్రియల్ పార్కును నెలకొల్పారు. అప్పట్లో హైదరాబాద్‌లో పరిశ్రమలు ఏర్పాటుచేసిన కృష్ణాజిల్లాకు చెందిన వారితో పాటు ఏపీకి చెందినవారికి ఆహ్వానం పలికారు. భారీ పరిశ్రమలే కాకుండా సూక్ష్మ, చిన్న, మధ్య తరహా వంటి వాటిని కూడా ఆహ్వానించారు. ఇందుకు మల్లవల్లిలో అనువైన భూములను గుర్తించారు. భూ సేకరణ విధానంలో మొత్తం 1,200 ఎకరాలు సేకరించారు. ఇందులో 1,000 ఎకరాల విస్తీర్ణంలో మోడల్ ఇండస్ట్రియల్ పార్కు(ఐపీ)ను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అప్పట్లో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి మెగా ఫుడ్ పార్కును కేటాయించింది. దీనిని మల్లవల్లిలో ఏర్పాటు చేయాలని టీడీపీ ప్రభుత్వం నిర్ణయించింది. లే అవుట్, మౌలిక సదుపాయాల కల్పన పనులు చేపట్టింది. పారిశ్రామికవేత్తలను ఆహ్వానించటం కోసం ఎకరం రూ.కోటి విలువచేసే భూములను రూ.16 లక్షలకే ఇవ్వాలని టీడీపీ ప్రభుత్వం నిర్ణయించింది. అశోక్ లేల్యాండ్, మోహన్ స్పిన్‌టెక్స్ వంటి సంస్థలు బస్‌బాడీ ప్లాంట్, టెక్స్‌టైల్ పార్కులను ఏర్పాటు చేశాయి. ఈ రెండు సంస్థలే స్థానికంగా దాదాపు 2 వేల మందికి ఉపాధి కల్పించటానికి ముందుకొచ్చాయి. దాదాపు 600 మందికి పైగా ఎంఎస్ఎంఈ యూనిట్లను ఏర్పాటు చేయటానికి ఎంవోయూ చేసుకున్నారు. అప్పటి ఏపీఐఐసీ అధికారులు మౌలిక సదుపాయాల కల్పన పనులను కూడా అంతే స్థాయిలో చేపట్టారు. ఈలోపు 2019 ఎన్నికలు వచ్చాయి.

వైసీపీ వచ్చాక అన్నీ పాయె..

వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే, మల్లవల్లిలో అన్యాయాలు జరిగిపోయాయంటూ విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. ఈ పరిణామంతో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ఖిన్నులయ్యారు. విజిలెన్స్ విచారణను తమకు నచ్చినట్టుగా తెప్పించుకుని, పురోగతిలో ఉన్న పనులను పట్టించుకోకుండా, యూనిట్లు ఏర్పాటు చేయలేదన్న వాదనలు తీసుకొచ్చి నోటీసులు ఇచ్చారు. తమ ఇబ్బందులు చెప్పుకోనివ్వకుండా ఆయా సంస్థలకు కేటాయించిన భూములను రద్దు చేశారు. దీంతో పరిశ్రమల నిర్వాహకులు కోర్టును ఆశ్రయించారు. చర్చల ద్వారా సమస్యను పరిష్కరించాలని కోర్టు సూచించినా వైసీపీ పట్టించుకోలేదు. ఇప్పటికీ ఆ సమస్య అపరిష్కృతంగానే ఉంది. ఈ క్రమంలో వైసీపీ భూముల ధరలను రెండు రెట్లు పెంచేసింది. ఎకరం రూ.16 లక్షలు ఉన్న భూమిని రూ.అరకోటికి చేర్చింది. ఫైనల్ అగ్రిమెంట్లు చేసుకోలేదంటూ వారందరికీ పెంచిన రేట్ల ప్రకారం భూములకు ధర చెల్లించాలని పేర్కొంది. దీంతో ఆయా సంస్థలు తీవ్ర ఆందోళన చెందాయి. మిగిలిన యూనిట్లను కూడా బలవంతంగా సాగనంపటానికే వైసీపీ ప్రభుత్వం చూసింది. మల్లవల్లిలో ఏర్పాటుచేసిన భారీ పరిశ్రమలకు ఊతం ఇవ్వకపోగా, వాటికి నోటీసుల మీద నోటీసులు ఇస్తూ కక్ష సాధించింది. కరోనా అనంతర సంక్షోభ పరిస్థితుల్లో ఎలక్ట్రికల్ వాహనాల ఆర్డర్లు లేక అశోక్ లేల్యాండ్ ఉత్పాదకత నిలిచింది. ఆ సంస్థతో సంప్రదింపులు జరిపి, దాని ఇబ్బందులను గుర్తించి, పరిష్కరించని వైసీపీ నోటీసులు మాత్రం ఇచ్చింది.

మనోవేదనతో నా భర్త చనిపోయాడు

భూమికి సంబంధించిన రశీదులున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదు. భూమి సాగులో లేదని నష్టపరిహారం విషయంలో తప్పుదోవ పట్టించారు. ప్రభుత్వం మారాక మా వద్ద ఉన్న రశీదులను అధికారులకు, ప్రజాప్రతినిధులకు చూపించినా ఫలితం కనిపించలేదు. ఈ మానసిక వేదనతో నా భర్త మృతిచెందాడు. - నాగమణి, మల్లవల్లి బాధితురాలు

పండుటాకులపై పైశాచికం





రాజకీయ వికృత క్రీడలో పండుటాకులు ఎండిపోతున్నారు. పెన్షన్ కోసం ఆడుతున్న ప్రభుత్వ పైశాచికానందంలో ముదుసలులు మాడిపోతున్నారు. ఈ చిత్రాలే అందుకు నిదర్శనం. విజయవాడ పైపులరోడ్డులోని ఎస్‌బీఐ బ్యాంక్ వద్ద శుక్రవారం మధ్యాహ్నం 11.30 గంటలకు కూడా వృద్ధులను లోపలకు పోనివ్వకుండా గేటు బయటే ఆపేశారు. అదేమని అడిగితే లోపల రద్దీ ఉందని గేటుకు అడ్డంగా సెక్యూరిటీని పెట్టారు. చచ్చీచెడి లోపల వరకూ వెళ్తే సుమారు గంటపాటు క్యూలైన్‌లో నిలబెట్టి.. ఆ తరువాత అయినా పెన్షన్ ఇచ్చారా అంటే.. అదీ లేదు. ఒక చిన్న పేపర్ ముక్క ఇచ్చి.. రోడ్డుకు అవతలవైపున కస్టమర్ కేర్‌లో డబ్బు తీసుకోమని చెప్పారు. ఇన్ని కష్టాలు పడి స్లిప్పు సాధిస్తే, రోడ్డు దాటుకుని వెళ్లి, సదరు కస్టమర్ కేర్ వద్ద డబ్బు తీసుకోవడానికి ముచ్చెమటలు పట్టించారు. సరైన క్యూ ఏర్పాటుచేయని ఈ కస్టమర్ కేర్ నిర్వాహకులు వయస్సు మీద పడినవారని కూడా చూడకుండా గంటలకొద్దీ నిలబెట్టారు. అక్కడ మరో గంటపాటు యుద్ధం చేశాక పెన్షన్ చేతికందడానికి సుమారు మధ్యాహ్నం 1.30 నుంచి 2.30 గంటలైంది. 42 డిగ్రీలున్న ఆ ఎండలోనే కొందరు వృద్ధులు బతుకుజీవుడా.. అంటూ ఇళ్లకు వెళ్లగా, ఇంకొందరు సొమ్మసిల్లి అక్కడే కూలబడిపోయారు.

పైసామే.. పాలిట్రిక్స్

పోలింగ్ తేదీ దగ్గరపడేకొద్దీ డబ్బుల కట్టల పాములు బయటపడుతున్నాయి. శనివారం నుంచి పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ మొదలుకానుండడంతో ఇక అధికార పార్టీ నాయకులు రంగంలోకి దిగారు. ఓవైపు ఉద్యోగులకు రేటు నిర్ణయించి పోస్టల్ ఓటింగ్‌ను తమవైపు తిప్పుకొనే ప్రయత్నం చేస్తుండగానే, మరోవైపు డబ్బు పంపిణీపై గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. ఓటుకు రేటు కట్టి 'ఇంత ఇస్తాం..' అని ముందే చెప్పేస్తున్నారు.



జిల్లాలో మొదలైన అధికార పార్టీ నగదు పంపిణీ

నేటి పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌పై ప్రధాన దృష్టి

- ఉద్యోగుల ఓటుకు రేటు కట్టి పంపకాలు
- యూనియన్ నాయకులతో తెరవెనుక మంతనాలు
- ఓటు ఎవరికి వేశారో వాట్సాప్ పెట్టాలని ఒత్తిడి
- ఓటుకు ఇంత ఇస్తామంటూ గ్రామాల్లో ప్రచారం
- టీడీపీలోని బలమైన నాయకులనూ వదలని వైనం
- డబ్బిస్తాం.. తమకు అనుకూలంగా పనిచేయాలంటూ ఎర

(ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం) : శనివారం నుంచి ఈనెల 6వ తేదీ వరకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఉద్యోగులు ఓటుహక్కును వినియోగించుకునే అవకాశం కల్పించారు. దీంతో ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు వేసే పోస్టల్ బ్యాలెట్‌పై అధికార పార్టీ అభ్యర్థులు దృష్టిపెట్టారు. టీచర్స్, రెవెన్యూ, పంచాయతీరాజ్ తదితర విభాగాల యూనియన్ నాయకులను పిలిపించి వైసీపీకి ఓట్లు వేయించేలా తెరవెనుక చక్రం తిప్పుతున్నారు. యూనియన్ నాయకులేమో తమతో పాటే పనిచేసే ఉద్యోగులకు ఫోన్‌చేసి పోస్టల్ బ్యాలెట్‌లో ఓటువేస్తే ఎవరికి వేశారో వాట్సాప్‌లో చెప్పాలని కోరారు. మచిలీపట్నం, గుడివాడ, పెనమలూరు, ఉయ్యూరు తదితర ప్రాంతాల్లో ఉద్యోగులు అధికంగా ఉండటంతో ఈ ప్రక్రియ గుట్టు చప్పుడు కాకుండా జరుగుతోంది. దీనిపై టీడీపీ నాయకులు కలెక్టర్ బాలాజీకి ఫిర్యాదు చేశారు. కాగా, గుడివాడ, మచిలీపట్నం ప్రాంతంలో పోస్టల్ బ్యాలెట్‌కు ఒక్కొక్కరికీ రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకూ ఇస్తున్నట్టు తెలిసింది.

టీడీపీ నాయకుల ఫిర్యాదు

మచిలీపట్నం నోబుల్ కళాశాల, గన్నవరంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల, గుడివాడలో వీకేఆర్ వీఎన్‌బీ ఇంజనీరింగ్ కళాశాల, పెడనలో వాసవీ ఇంజనీరింగ్ కళాశాల (నందమూరు), అవనిగడ్డలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పామర్రులో ఎస్‌కేఆర్‌ఆర్ జడ్పీ ఉన్నత పాఠశాల, పెనమలూరులో జడ్పీ ఉన్నత పాఠశాలలో పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్లు ఏర్పాటుచేశారు. ఉద్యోగులు ఓటువేసే సమయంలో అక్కడ స్థానిక పోలీసులను కాకుండా వేరే ప్రాంతానికి చెందిన పోలీసులను ఏర్పాటుచేయాలని టీడీపీ నాయకుడు ఐ.దిలీప్‌కుమార్ కలెక్టరుకు లేఖ రాశారు. ఇదే లేఖను ఎన్నికల సంఘం సీఈవోకు, కేంద్ర ఎన్నికల కమిషన్‌కు కూడా ఆయన పంపారు.

డబ్బు పంపిణీపై విస్తృత ప్రచారం

అధికార పార్టీ నాయకులు ఓటర్లకు నగదు పంపిణీ చేసేందుకు కసరత్తు ప్రారంభించారు. పార్టీ తరఫున ఓటరుకు వెయ్యి రూపాయలు ఇవ్వాలని ఇప్పటికే నగదు చేరవేసినట్లు ఆ పార్టీ నాయకులే చెప్పుకొంటున్నారు. నియోజకవర్గంలో పోటీచేసే అభ్యర్థి మరో వెయ్యి రూపాయలు వేసుకుని ఓటరుకు రూ.2 వేల చొప్పున పంపిణీ చేస్తామని విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ప్రచారంలో పాల్గొంటున్న నాయకులు, కార్యకర్తలు అధిక ఉష్ణోగ్రతల్లో తిరగలేకపోతున్నామని, ఖర్చుల కోసం మరింత నగదు పెంచాలని డిమాండ్ చేయటం గమనార్హం.

టీడీపీ నేతలకూ ప్రలోభాలు

మచిలీపట్నం నియోజకవర్గంలోని కిందిస్థాయి టీడీపీ నాయకులను తమవైపునకు తిప్పుకొనేందుకు అధికార పార్టీ నేతలు తమదైన శైలిలో ప్రయత్నాలు చేస్తున్నారు. బందరు మండలం తాళ్లపాలేనికి చెందిన టీడీపీ నాయకుడి ఇంటికి వెళ్లిన ఇద్దరు వైసీపీ నేతలు ఈసారి తమకు అనుకూలంగా పనిచేయాలని, రూ.25 లక్షలు ఇస్తామని ప్రతిపాదన పెట్టారు. కంగుతిన్న సదరు నాయకుడు టీడీపీ పెద్దలకు విషయం చెప్పాడు. తనకు నగదు అవసరం లేదని, టీడీపీకి అనుకూలంగానే పనిచేస్తానని ఆయన చెప్పడంతో వైసీపీ నేతలు వెనుదిరిగారు.

కన్నుగప్పి కబ్జా..!

అంబాపురంలో వైసీపీ నేత వల్లభనేని వంశీ అనుచరుల అక్రమాలు



సర్వే నెం 96/2బీలో కబ్జాకు గురైన కామన్ స్థలం ఇదే..

'ఎన్నికల్లో గెలిచే పరిస్థితి లేదు.. అందినకాడికి దోచేసుకుందాం..' అనుకున్నారో ఏమో గన్నవరం వైసీపీ అభ్యర్థి వల్లభనేని వంశీమోహన్ అనుచరులు దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టేస్తున్నారు. అధికారులు, ప్రతిపక్షాలు ఎన్నికల హడావిడిలో ఉండగా, అదునుచూసి విజయవాడ రూరల్ మండలం అంబాపురంలో కబ్జాలకు తెగబడుతున్నారు. తమ నాయకుడి అండతో కామన్ సైట్లు ఎక్కడుంటే అక్కడ వాలిపోయి, అమ్మకాలకు పెట్టేస్తున్నారు.

- రూ.10 కోట్ల విలువైన మూడు స్థలాల ఆక్రమణ
- అందరూ ఎన్నికల హడావిడిలో ఉండగా విక్రయాలు
- ఫిర్యాదులు ఉన్నా వెనక్కి తగ్గని కబ్జాసురులు

విజయవాడ రూరల్ : రెండు వారాల్లో ఎన్నికలు.. అధికార యంత్రాంగమంతా ఎన్నికల ఏర్పాట్లలో నిమగ్నమై ఉంది.. ప్రతిపక్షాలు ఎన్నికల పనుల్లో తనమునకలై ఉన్నాయి.. ఇదే సరైన తరుణం అనుకున్నారేమో అంబాపురం వైసీపీ నేతలు. అందరూ ఎన్నికల హడావిడిలో ఉండగా గ్రామ వైసీపీ నేతలు మాత్రం తమ పనులను చక్కబెట్టుకుంటున్నారు. గ్రామ పరిధిలోని పంచాయతీ కామన్ స్థలాలను కబ్జా చేసేస్తున్నారు. మూడుచోట్ల ఒకేసారి భూకబ్జాలకు దిగారు. గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ అండతో సుమారు రూ.10 కోట్ల విలువైన పంచాయతీ భూములను కాజేసే ప్రణాళిక వేసుకున్నారు. ప్రభుత్వ స్థలాల్లో ఫెన్సింగ్ వేసి అమ్మకాలకు పెట్టేశారు. ఈ స్థలాలు కబ్జాలకు గురవుతున్నాయని గతంలో ఫిర్యాదులు ఉన్నా.. ఏమీ పట్టకుండా తమ పని తాము చేసుకుపోతున్నారు.

ఇన్నర్ రింగ్‌రోడ్డును ఆనుకుని రూ.6 కోట్ల స్థలం

పైపులరోడ్డు సెంటర్ నుంచి మిల్క్‌ప్రాజెక్టుకు వెళ్లే దారిలో ఇన్నర్ రింగ్ రోడ్డును ఆనుకుని అంబాపురం పంచాయతీ 11వ లైన్‌లో సర్వే నెంబర్ 96/2బీలో 2 వేల గజాల కామన్ స్థలం ఉంది. ఈ స్థలం కబ్జా చేసేందుకు గతంలో వైసీపీ గ్రామ నేతలు ప్రయత్నించారు. అప్పట్లో ఫిర్యాదులు వెల్లువెత్తడంతో వెనక్కి తగ్గారు. మరోసారి కబ్జాకు ప్రయత్నించగా, స్థానిక ఎమ్మార్వో విచారణ చేపట్టి, అధికారుల నుంచి ఫిర్యాదు తీసుకుని సదరు స్థలంలోకి ఎవరూ వెళ్లకూడదని ఆదేశించారు. అయితే, రెండు రోజులుగా వైసీపీ నేతలు సదరు పంచాయతీ కామన్ స్థలంలోకి చొరబడి 2 వేల గజాలను మూడు భాగాలుగా విభజించి కొలతలు వేసినట్టు తెలుస్తోంది. అంతేకాదు.. ఫెన్సింగ్ రాళ్లను కూడా తరలించారు. రేపోమాపో పాగా వేసేందుకు సిద్ధమవుతున్నారు. పనిలో పనిగా సదరు స్థలాన్ని అమ్మకానికి కూడా పెట్టేశారు.



సర్వే నెం 94/2లో ప్రభుత్వ బోర్డు తొలగింపు



సర్వే నెం 97/2 కామన్ స్థలంలో అక్రమ నిర్మాణం

పలగాని రోడ్డులో రూ.3 కోట్ల స్థలం


ఇన్నర్ రింగ్‌రోడ్డును ఆనుకుని పైపులరోడ్డు నుంచి మిల్క్‌ప్రాజెక్టుకు వెళ్లే దారిలోని పలగాని రోడ్డులో సర్వే నెంబర్ 94/2లో రూ.3 కోట్ల విలువైన వెయ్యి గజాల స్థలం కూడా కబ్జా చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. గతంలో సదరు స్థలం కబ్జాదారుల పాలవుతుందన్న విషయాన్ని గమనించి అధికారుల ఫెన్సింగ్‌తో పాటు బోర్డులను కూడా ఏర్పాటు చేశారు. అయితే, రెండు నెలల క్రితం ఆ స్థలంలోకి చొరబడిన కబ్జాదారులు బోర్డులను తొలగించారు. ఫెన్సింగ్ రాళ్లపై అధికారులు రాయించిన పెయింటింగ్‌లపై ఎర్రరంగు పులిమి తుడిపేశారు.

రూ.కోటి విలువైన స్థలం

అంబాపురం పంచాయతీ పరిధిలో సర్వే నెంబర్ 97/2లో రూ.కోటి విలువైన 370 గజాల కామన్ స్థలాన్ని కూడా వైసీపీ నేతలు కబ్జా చేశారు. సదరు స్థలంలో అక్రమ నిర్మాణాలు చేపట్టి విక్రయాలు జరుపుతున్నా అధికారులు నోరు మెదపట్లేదు.

8న బెజవాడలో ప్రధాని రోడ్ షో

ఎన్టీఆర్ కలెక్టర్ ఢిల్లీరావు వెల్లడి



కృష్ణలంక, మే 3 : ఈనెల 8వ తేదీన ప్రధానమంత్రి నరేంద్రమోదీ విజయవాడలో రోడ్ షో నిర్వహించనున్నారు. ఈ పర్యటన నేపథ్యంలో శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి సంబంధిత జిల్లా కలెక్టర్లు, పోలీస్, ఇతర అధికారులతో వర్చువల్ విధానంలో సమావేశం ఏర్పాటు చేశారు. నగరంలోని కలెక్టరేట్ నుంచి కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ ఈసీఐ మార్గదర్శకాల మేరకు ప్రధాని పర్యటనకు అన్ని ఏర్పాట్లు చేస్తామన్నారు. సీఎస్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు ఏర్పాట్లు చేయాలని, ఎటువంటి లోటుపాట్లకు తావులేకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. కలెక్టర్ వివరణ ఇస్తూ షెడ్యూల్ ప్రకారం ఈ నెల 8వ తేదీ బుధవారం సాయంత్రం 6.25 గంటలకు ప్రధాని మోదీ గన్నవరం విమానాశ్రయానికి చేరుకుంటారన్నారు. అక్కడి నుంచి రోడ్డుమార్గాన బయల్దేరి సాయంత్రం 7 నుంచి 8 గంటల వరకు విజయవాడలో రోడ్ షో నిర్వహిస్తారని, అనంతరం గన్నవరం విమానాశ్రయానికి చేరుకుని ఢిల్లీకి బయల్దేరి వెళ్తారని పేర్కొన్నారు.

మళ్లీ రెచ్చిపోయారు!

- కృష్ణా జిల్లాలో టీడీపీ మైనారిటీ నేత ఇంటిపై వైసీపీ మూకల దాడి
- తీవ్రంగా గాయపడిన టీడీపీ నేత కొడుకు, మనవరాలు
- వంశీ ప్రచారం ముగించిన 10 నిమిషాలకే కుటుంబంపై దాడి
- కేసు నమోదు చేసిన వీరవల్లి పోలీసులు



షేక్‌నసీమా మీర్జావలి చేతులకు గాయాలు



హనుమాన్ జంక్షన్ రూరల్, మే 3 : కృష్ణా జిల్లాలో మరోసారి వైసీపీ మూకలు రెచ్చిపోయాయి. టీడీపీ మైనారిటీ నేత ఇంటిపై దాడిచేసి ఆయన కుమారుడు, 16 ఏళ్ల మనవరాలిని తీవ్రంగా గాయపరిచారు. ఈ ఘటన గన్నవరం నియోజకవర్గం బాపులపాడు మండలం కొత్త మల్లవల్లిలో గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. కొత్త మల్లవల్లికి చెందిన టీడీపీ మైనారిటీ నేత షేక్‌జాన్ బాషా, ఆయన కుమారుడు మీర్జావలి టీడీపీలో క్రియాశీలకంగా ఉన్నారు. గురువారం ఉదయం కొత్త మల్లవల్లి చెంతనే ఉన్న నూజివీడు నియోజకవర్గం మీర్జాపురానికి నూజివీడు టీడీపీ అభ్యర్థి కొలుసు పార్థసారథి వచ్చారు. ఆయన్ను కలిసేందుకు కొత్తమల్లవల్లికి చెందిన మీర్జావలి వెళ్లారు. అక్కడే ఆలీ అనే వైసీపీ కార్యకర్త ఉండటంతో మీర్జావలి అతని గురించి.. ఆలీ గన్నవరం నియోజకవర్గంలో వైసీపీకి, నూజివీడు నియోజకవర్గంలో టీడీపీకి పనిచేస్తున్నారని సారథికి ఫిర్యాదు చేశారు. తనపై ఫిర్యాదు చేశాడనే విషయాన్ని మనసులో పెట్టుకుని గురువారం రాత్రి కొత్తమల్లవల్లిలో గన్నవరం వైసీపీ అభ్యర్థి వంశీతోపాటు ప్రచారానికి వచ్చిన ఆలీ, మరో 50 మంది మీర్జావలి కుటుంబంతో ఘర్షణకు దిగారు. ఆలీతోపాటు బాపులపాడు మండల కో-ఆప్షన్ సభ్యుడు షేక్ తానీషా, రఫీ, ముంతాజ్ తదితరులు మీర్జావలి, ఆయన తండ్రి షేక్ జాన్ బాషా ఇతర కుటుంబసభ్యులపై కర్రలతో దాడి చేశారు. మీర్జావలిపై బీరు సీసాతో దాడి చేయగా చేతికి గాయమై నరం తెగింది. గురువారం రాత్రి వంశీ ఎన్నికల ప్రచారం ముగించిన 10 నిమిషాలకే ఈ ఘర్షణ చోటుచేసుకోవడం గమనార్హం. గొడవను సెల్ ఫోన్‌లో చిత్రీకరిస్తున్న షేక్ జాన్ బాషా మనవరాలు (16) నసీమాపైనా కర్రతో దాడి చేయడంతో ఆమె చెయ్యి విరిగింది. గ్రామంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ పికెట్ ఏర్పాటు చేసినట్టు ఎస్సై చిరంజీవి తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు శుక్రవారం ఉదయం పోలీసులు కేసు నమోదు చేశారు. రంజాన్ సందర్భంగా ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసి యార్లగడ్డ వెంకట్రావును అతిథిగా పిలిచినప్పటి నుంచి కక్షగట్టి తమను దుర్భాషలాడుతున్నారని, వంశీ అండ చూసుకుని గురువారం అర్ధరాత్రి దాడికి తెగబడ్డారని షేక్ జాన్‌భాషా ఆవేదన వ్యక్తం చేశారు.

మహిళలపై భౌతికదాడులు ఆటవికచర్య : యార్లగడ్డ

ప్రజావ్యతిరేక విధానాలు, అరాచకపాలనకు వ్యతిరేకంగా శాంతియుతంగా పోరాడుతున్న టీడీపీ మైనారిటీ నేతల ఇళ్లపై దాడులకు తెగబడటంతో పాటు మహిళలపై దౌర్జన్యాలకు పాల్పడటం ఆటవిక చర్య అని యార్లగడ్డ వెంకట్రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొత్తమల్లవల్లి వైసీపీ మూకదాడిలో గాయపడి నూజివీడు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మీర్జావలిని శుక్రవారం యార్లగడ్డ వెంకట్రావు సోదరుడు సతీష్ స్థానిక టీడీపీ నేతలతో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా యార్లగడ్డ బాధితుడితో ఫోన్‌లో మాట్లాడి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. దాడిచేసిన వారిని వదలిపెట్టి బాధితుడిపైనే కేసు నమోదు చేయడం పట్ల టీడీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధితుడికి న్యాయం జరిగే వరకూ అండగా ఉంటామని సతీష్, టీడీపీ నేతలు భరోసా కల్పించారు. మండల అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు, యనమదల వెంకయ్యారావు, అలూరి సురేశ్, అక్కినేని ధర్మరాజు, వేములపల్లి శ్రీనివాసరావు, ఆళ్ల గోపాలకృష్ణ, మూల్పూరి సాయికళ్యాణి, తుమ్మల ఉదయ్, మండాది రవీంద్ర, మేడేపల్లి రమ, అక్కినేని కృష్ణాజీ, తదితరులు పాల్గొన్నారు.



మీర్జావలిని పరామర్శిస్తున్న టీడీపీ నేతలు

సంక్షేమానికి చిరునామా టీడీపీ



తూర్పు నియోజకవర్గ ఎన్నికల ప్రచారంలో నందమూరి రామకృష్ణ

జగన్ ప్రతీ పథకంలో స్కామ్..

- నందమూరి రామకృష్ణ

పటమట, మే 3 : జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం సంక్షేమం పేరుతో అమలు చేసిన ప్రతీ పథకంలోనూ స్కామ్ ఉందని, ప్రజా సంక్షేమ పథకాలకు చిరునామా టీడీపీయేనని ఎన్టీఆర్ కుమారుడు నందమూరి రామకృష్ణ అన్నారు. తూర్పు నియోజకవర్గ పరిధిలోని 10వ డివిజన్‌లో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌తో కలిసి శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నందమూరి రామకృష్ణ మాట్లాడుతూ, గత ఐదేళ్లుగా జగన్మోహన్‌రెడ్డి రాక్షసపాలన చూశామని, ఆయన వ్యవస్థలన్నింటినీ నిర్వీర్యం చేశాడని విమర్శించారు. వైసీపీ పాలనలో రాష్ట్రంలో ఏ ఒక్కరికీ రక్షణ లేదన్నారు. ఎన్టీఆర్ చేపట్టిన సంక్షేమ పథకాలు దేశం మొత్తం అమలు చేస్తోందన్నారు. జగన్ ప్రభుత్వంలో విద్యుత్, బస్సు చార్జీలు, ఇంటి పన్నులు పెంచారని, ఇసుకను బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఆరోపించారు. జగన్ పాలనకు అంతం పలకాలంటే ఈ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గద్దె రామ్మోహన్, ఎంపీగా కేశినేని శివనాథ్‌లకు సైకిల్ గుర్తుపై ఓట్లేసి గెలిపించాలని రామకృష్ణ ఓటర్లను కోరారు. జనసేన, బీజేపీ బలపర్చిన కూటమి అభ్యర్థులు ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా కేశినేని శివనాథ్(చిన్ని)లను గెలిపించాలని గద్దె రామ్మోహన్ ప్రజలను అభ్యర్థించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఓట్లతో జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చి వారి అభివృద్ధికి కృషి చేయలేదన్నారు. వైసీపీ ప్రభుత్వం సరఫరా చేసిన కల్తీ మద్యం తాగి ఐదు లక్షల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలు మరణించారని ఆరోపించారు. పిల్లల ఫీజు రీయింబర్స్‌మెంట్ పూర్తిగా అటకెక్కిందని, చదువు పూర్తి అయిన విద్యార్థుల సర్టిఫికెట్లు కాలేజీల బీరువాల్లో ఉన్నాయన్నారు. ఓటర్లను అయోమయం చేయడానికి నియోజకవర్గంలో జనసేన ఎన్నికల గుర్తు గాజుగ్లాసును కూడా బ్యాలెట్ పేపర్లో పెట్టించారని, ఓటర్లు ఈ విషయంలో జాగ్రత్తగా ఉండాలని రెండు ఓట్లు సైకిల్ గుర్తుపై వేయాల్సిందిగా గద్దె కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ దేవినేని అపర్ణ, పొన్నం శ్రీనివాస్, పోతంశెట్టి నాగేశ్వరరావు, ముమ్మనేని ప్రసాద్, పొలగాని జగన్మోహన్‌రావు, జయప్రకాష్, రాజేంద్రలు పాల్గొన్నారు.



కొల్లు రవీంద్రకు తమ గోడు చెప్పుకుంటున్న డివిజన్ మహిళలు

కష్టాల తొలగిపోవాలంటే.. జూన్ 4 వరకు ఓపికపట్టండి : రవీంద్ర

మచిలీపట్నం టౌన్ : ఇంకెంత కాలం రవీంద్ర బాబూ.. ఈ దౌర్జన్యాలు.. కష్టాలు.. మా బతుకులు ఇలా తెల్లారవలసిందేనా.. అంటూ మాజీ మంత్రి, మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి కొల్లు రవీంద్రకు శుక్రవారం డివిజన్ మహిళలు తమ గోడు వినిపించారు. జనసేన నియోజక వర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణతో కలిసి కొల్లు రవీంద్ర 6, 10, 14 డివిజన్లలో పర్యటించారు. ఈ సందర్భంగా మహిళలు రవీంద్రకు తమ సమస్యలు చెప్పుకున్నారు. ఎమ్మెల్యే పేర్ని నానికి సమస్యలు చెప్పుకున్నా వినిపించుకోలేదన్నారు. ఎప్పుడు వెళ్లినా చూద్దామంటూ ఐదేళ్ల కాలం గడిపేసారన్నారన్నారు. మా కష్టాలు తీరుతాయా.. అని వైసీపీ ప్రభుత్వ బాధితులు తమ గోడును కొల్లు రవీంద్రకు చెప్పారు. ఈ సందర్భంగా రవీంద్ర మాట్లాడుతూ, జూన్ 4 తరువాత ప్రజా ప్రభుత్వం వస్తుందని, అప్పుడు అందరి సమస్యలు తీరుతాయన్నారు. పేర్నినాని ఓటమి భయంతోనే తన కొడుకుని ఎన్నికల్లో నిలబెట్టారన్నారు. గంజాయి బ్యాచ్ ప్రజలను బెదిరించి ఓట్లు వేయించుకోవాలని చూస్తున్నారన్నారు. గంజాయిబ్యాచ్ కావాలో బందరును అభివృద్ధి చేసే వారు కావాలో ప్రజలు ఆలోచించుకోవాలన్నారు. ప్రజాగ్రహానికి గురైన పేర్ని కుటుంబం ఎన్నికల అనంతరం రాజకీయ సన్యాసం తీసుకోక తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజనీర్ మురళీకృష్ణ, ఇలియాస్ బాషా, కాంతారావు తదితరులు పాల్గొన్నారు. రవీంద్ర, బండి రామకృష్ణను అభిమానులు గజమాలతో స్వాగతం పలికారు.



వల్లభనేని బాలశౌరిని కలసిన న్యాయవాదులు

భూ హక్కు చట్టాన్ని రద్దు చేస్తాం : బాలశౌరి

మచిలీపట్నం టౌన్ : ప్రజాసేవలో న్యాయవాదులు పాల్గొంటూ పలువురు రాజకీయ నాయకులకు స్ఫూర్తినిస్తున్నారని ఎన్‌డిఏ కూటమి అధికారంలోకి రాగానే న్యాయవాదుల సమస్యలను పరిష్కరిస్తామని మచిలీపట్నం పార్లమెంటు ఉమ్మడి అభ్యర్థి వల్లభనేని బాలశౌరి అన్నారు. శుక్రవారం బాలశౌరిని పలువురు న్యాయవాదులు కలసి వివిధ సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా బాలశౌరి మాట్లాడుతూ, భూ హక్కు చట్టంపై న్యాయవాదులు రిలే దీక్షలు చేశారని, ప్రభుత్వం అధికారంలోకి రాగానే భూ హక్కు చట్టాన్ని వెంటనే రద్దు చేయిస్తామన్నారు. రానున్న ఎన్నికల్లో న్యాయవాదులు ఉమ్మడి అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని బాలశౌరి కోరారు. కాగా న్యాయవాదులకు వెల్ఫేర్ ఫండ్‌ను పెంచాలని మచిలీపట్నం న్యాయవాదుల సంఘం మాజీ అధ్యక్షుడు పుప్పాల ప్రసాద్ కోరారు. జూనియర్ న్యాయవాదులకు ట్రైనింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేసి నెట్‌తో కూడిన లైబ్రరీని ఏర్పాటు చేయాలన్నారు. న్యాయవాదులు మాదివాడ వెంకట నరసింహారావు, కొనకళ్ల రాధాకృష్ణ, అద్దేపల్లి నిరంజనరావు, యు. శ్రీనివాస్, శలపాటి రాజేష్, తిరుమాని సత్యనారాయణ, న్యాయవాద గుమాస్తాల సంఘ నాయకుడు పి.వి. ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీకి ఇదే ఆఖరు కావాలి.. వెనిగండ్ల



గుడివాడ : సైకో పాలన నుంచి రాష్ట్రాన్ని కాపాడుకునేందుకు ఇదే ఆఖరి అవకాశమని, ఓటర్లే న్యాయనిర్ణేతలని టీడీపీ అభ్యర్థి వెనిగండ్ల రాము అన్నారు. శుక్రవారం మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావుతో కలిసి వెనిగండ్ల రాము గుడ్లవల్లేరు మండలం రెడ్డిపాలెం నుంచి రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సైకో జగన్ పాలనలో రాష్ట్రం సర్వనాశనమైందన్నారు. రాష్ట్రాన్ని కాపాడుకునేందుకు పొత్తు పెట్టుకున్నామన్నారు. ముస్లింల అభివృద్ధి, అభ్యున్నతి టీడీపీ కూటమితోనే సాధ్యమన్నారు. రోడ్‌షోలో జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. వెనిగండ్లకు అడుగడుగునా మహిళలు మంగళహారతులు పట్టారు. కొసరాజు బాపయ్యచౌదరి, వల్లభనేని వెంకట్రావు, కార్యకర్తలు పాల్గొన్నారు. వెనిగండ్ల సమక్షంలో పలువురు వైసీపీ మైనార్టీ నాయకులు టీడీపీలో చేరారు.



కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన మండలి బుద్ధప్రసాద్

కూటమితోనే మహిళాభ్యున్నతి : మండలి

అవనిగడ్డ : రాష్ట్రంలో మహిళల సంక్షేమం, అభ్యున్నతి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని మాజీ ఉపసభాపతి, ఎన్డీఏ కూటమి అవనిగడ్డ నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి మండలి బుద్ధప్రసాద్ అన్నారు. శుక్రవారం అవనిగడ్డలోని బీసీ కాలనీకి చెందిన మహిళలు జనసేన పార్టీలోకి చేరారు. జనసేన పార్టీ జిల్లా అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాలరావు ఆధ్వర్యంలో బీసీకాలనీకి చెందిన భారతి, నాగమల్లేశ్వరి, హారిక, మంగ, చింతా శివ, చైతన్య, సుధీర్, వినాయక్, వెంకీ, సాయి, సందీప్, శ్రీనివాస్‌లు జనసేన పార్టీలోకి చేరగా, బుద్ధప్రసాద్ వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం మండలి మాట్లాడుతూ, జగన్మోహన్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజలపై మోయలేని భారాన్ని మోపారన్నారు. కూటమి ప్రభుత్వం మహిళలు, యువతను ఆదుకోవటమే లక్ష్యంగా మేనిఫెస్టో రూపొందించారని తెలిపారు. మెగా డిఎస్సీ నోటిఫికేషన్, పెన్షన్ల పెంపు, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం వంటి ఎన్నో పథకాలను రూపొందించినట్టు తెలిపారు. కార్యక్రమంలో అవనిగడ్డ, కోడూరు మండలాల అధ్యక్షులు గుడివాక శేషుబాబు, మర్రే గంగయ్య, పట్టణ అధ్యక్షులు రాజనాల వీరబాబు పాల్గొన్నారు.

కూటమికి మద్దతిచ్చి ఓటు విలువ కాపాడండి



మచిలీపట్నం టౌన్ : సంపదను సృష్టించే కూటమి ప్రభుత్వానికి మద్దతు ఇవ్వాలని తెలగ, బలిజ, కాపు జేఏసీ దక్షిణ భారతదేశ కన్వీనర్ దాసరి రాము కోరారు. వల్లభనేని బాలశౌరి కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అందరికీ రాజ్యాధికారం సాధించాలనే లక్ష్యంతో టీడీపీ, జనసేన, బీజేపీ ఈ ఎన్నికల్లో పోటీ చేస్తోందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల సంక్షేమమే లక్ష్యంగా పవన్ కళ్యాణ్ పనిచేస్తున్నారన్నారు. సుపరిపాలన అందించే పాలకులను ఎన్నుకోవడం వల్ల ప్రజాస్వామ్యం వర్ధిల్లుతుందన్నారు. పేదరికాన్ని, అజ్ఞానాన్ని అడ్డుపెట్టుకుని వైసీపీ పాలకులు ఓటును కొనాలని చూస్తున్నారన్నారు. కన్నతల్లి వంటి ఓటును అమ్ముకుంటే అది క్షమించరాని నేరమన్నారు. ఎన్డీఏ కూటమి అధికారంలోకి వస్తే ఉచిత పథకాలు ఆగుతాయని వైసీపీ నాయకులు ప్రచారం చేస్తున్నారని, ఈ పథకాలు ఏవీ ఆగవన్నారు. విశ్వబ్రాహ్మణ కాలనీలో ఒక బీసీ కులస్థుడిపై వైసీపీ నాయకులు దాడి చేయడం దుర్మార్గమన్నారు. సెలవులు వచ్చాయని తీర్థయాత్రలకు వెళ్ళకుండా అందరూఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. బందరు పోర్టు, ఇండస్ట్రియల్ కారిడార్ అభివృద్ధి చేసే సత్తా బాలశౌరి, కొల్లు రవీంద్రలకు ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, బీజేపీ మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ సోడిశెట్టి బాలాజీ, జనసేన నాయకులు మాదివాడ రాము, కొట్టి వెంకట్రావు, వంపుగడల చౌదరి, యానాది మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కా విజయబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రా హాస్పిటల్‌లో అత్యాధునిక వైద్యం

మాచవరం, మే 3 : ఆంధ్రా హాస్పిటల్, హీలింగ్ లిటిల్ హార్ట్స్ యూకే ఛారిటీ సంయుక్త ఆధ్వర్యంలో ఇప్పటి వరకు 4000 మంది చిన్నారులకు ఉచితంగా గుండె ఆపరేషన్లు విజయవంతంగా నిర్వహించినట్టు ఆంధ్రా హాస్పిటల్స్ డైరక్టర్, ప్రముఖ చిన్న పిల్లల వైద్యుడు డాక్టర్ పీవీ రామారావు తెలిపారు. సూర్యారావుపేటలోని ఆంధ్రా హార్ట్ అండ్ బ్రెయిన్ హాస్పిటల్‌లో శుక్రవారం విలేకర్ల సమావేశంలో డాక్టర్ పీవీ రామారావు మాట్లాడుతూ, గత నెల 29వ తేదీ నుంచి మే 4వ తేదీ వరకు ఆంధ్రా హాస్పిటల్‌లో హీలింగ్ లిటిల్ హార్ట్స్ యూకే ఛారిటీ సౌజన్యంతో 29 మంది చిన్నపిల్లలకు ఉచితంగా గుండె ఆపరేషన్లు చేసినట్టు తెలిపారు. విదేశీ వైద్య బృందం డాక్టర్ ఆండ్రూపారి, పీడియాట్రిక్ కార్డియాక్ సర్జన్ బ్రిస్టల్ యూకే, డాక్టర్ జోరేతి లిడ్ బెటర్, కన్సల్టెంట్ పీడియాట్రిక్ కార్డియాక్ ఇంటెన్సివిస్ట్ డాక్టర్ ఒరిజిత్ బెనర్జీ, కొచురని సెబాస్టియన్, హెలీ ఫిట్జ్ పాట్రిక్, అలెగ్జాండర్ టైలర్ తదితరులు హాస్పిటల్‌కు వచ్చి ఆసుపత్రి కార్డియాక్ సర్జన్ డాక్టర్ సాయిరాంతో కలిసి 15 మంది చిన్నారులకు గుండె ఆపరేషన్లు నిర్వహించారని తెలియజేశారు. అత్యంత క్లిష్టమైన గుండె జబ్బులు ఐయోర్టోపల్మనరి విండో విత్ ఇంటేర్రప్టెడ్ అయోర్టిక్ ఆర్చ్, అబ్స్ట్రక్టివ్ టోటల్ అనోమలాస్‌పల్మనరీ వీనస్ కనెక్షన్స్(టీఏపీవీడీ), మైట్రల్ వాల్వ్(పారాషూట్) రిపేర్, టెట్రాలజీ అఫ్ ఫాలో, పీఏ బాండింగ్ ఇతర క్లిష్టమైన గుండె ఆపరేషన్లు ఈ క్యాంపులో నిర్వహించారన్నారు. గత ఎనిమిదేళ్లుగా ఇప్పటి వరకు 29 సార్లు ఆంధ్ర హాస్పిటల్స్‌కు వచ్చి పిల్లలకు గుండె సర్జరీలు విజయవంతంగా చేశారని వివరించారు. సమావేశంలో డాక్టర్లు విక్రమ్, నాగేశ్వరరావు, సాయిరామ్, శ్రీమన్నారాయణ, రమేష్, రేవంత్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ పీవీ రామారావు

4, 5, 6 తేదీల్లో పోస్టల్ బ్యాలెట్

- కృష్ణా జిల్లాలో పెసిలిటేషన్ సెంటర్, స్ట్రాంగ్‌రూమ్ పరిశీలించిన కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం, మే 3 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం నోబుల్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోస్టల్ ఓటింగ్ పెసిలిటేషన్ సెంటరును కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ శుక్రవారం పరిశీలించారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే వివిధ విభాగాల ఉద్యోగులతా పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఈనెల 4, 5, 6 తేదీల్లో తమ ఓటుహక్కును వినియోగించుకునేందుకు అవకాశం కల్పించినట్టు ఆయన తెలిపారు. ఓటుహక్కు వినియోగించుకునేందుకు వచ్చిన ఉద్యోగులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని మచిలీపట్నం నియోజకవర్గం ఆర్వో ఎం.వాణికి సూచించారు. నోబుల్ కళాశాలలోని స్ట్రాంగ్‌రూమ్‌లో పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాలకు కేటాయించిన ఈవీఎంలలో అభ్యర్థుల పేర్లను సక్రమంగా అతికిస్తున్నదీ లేనిదీ ఆయన పరిశీలించారు. పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గలకు కేటాయించిన ఈవీఎంలను పూర్తిస్థాయిలో పరిశీలనచేసి తగు జాగ్రత్తలు తీసుకుని అభ్యర్థుల గుర్తులను ఈవీఎంలపై అతికించాలని సూచించారు. డీఆర్వో కె.చంద్రశేఖర్ వివిధ శాఖల అధికారులు కలెక్టర్ వెంట ఉన్నారు.



నోబుల్ కళాశాలలో ఈవీఎంలను పరిశీలిస్తున్న కలెక్టర్ బాలాజీ

ఈనెల 11 నుంచి జిల్లాలో 144సెక్షన్ అమలు

జిల్లాలో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిపేందుకు జిల్లా వ్యాప్తంగా ఈనెల 11వతేదీ నుంచి 13వతేదీ సాయంత్రం పోలింగ్ ప్రక్రియ పూర్తయ్యేవరకు జిల్లావ్యాప్తంగా 144సెక్షన్ అమలు చేస్తూ కలెక్టర్ డీకే బాలాజీ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఒకచోట ఐదుగురు కంటే వ్యక్తులు గుమికూడి ఉండకూడదని, కర్రలు, రాళ్లు, పేలుడు పదార్థాలు, ఇతర ఆయుధాలు పోలింగ్ కేంద్రాలకు తీసుకువెళ్లకూడదన్నారు. పోలింగ్ తేదీకి 48 గంటల ముందుగానే ఎన్నికల ప్రచారం నిలిపివేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈనెల 11వతేదీ సాయంత్రం 6గంటల నుంచి 13వతేదీ సాయంత్రం 6గంటల వరకు జిల్లాలో మద్యం అమ్మకాలపై నిషేధం విధిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు. జూన్ 4వతేదీన ఓట్లలెక్కింపు ఉంటుందని, ఈ తేదీకి 48 గంటల ముందే మద్యం విక్రయాలను నిలిపివేయాలని ఉత్తర్వులు జారీ చేశారు. ఎక్సైజ్, ఎస్ఈబీ అధికారులు ఈ ఉత్తర్వులు ఖచ్చితంగా అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఉత్తర్వులలో పేర్కొన్నారు.

ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌తో ఆస్తులకు ఎసరు

- వేలేరులో రైతు సంఘాల ధర్నా

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మే 3 : ప్రజలకు తమ స్వంత ఆస్తులపై హక్కు లేకుండా చేసి స్థిరాస్తులను లాగేసుకునేందుకే రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ తీసుకు వచ్చిందని రైతు నాయకులు ఆళ్ల గోపాలకృష్ణ, వేములపల్లి శ్రీనివాసరావు, గుండపనేని ఉమావర ప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వేలేరులోని పేద రైతు ఆయిల్‌పామ్ తోటలో రాష్ట్ర రైతు సంఘాల ఆధ్వర్యంలో రాజకీయాల కతీతంగా శుక్రవారం ధర్నా నిర్వహించారు. బాపులపాడు మండలంలోని కానుమోలు సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసును మోడల్‌గా ప్రకటించిన నేపథ్యంలో ఈ ధర్నా నిర్వహించారు. రీసర్వే చేయడం ద్వారా ఆస్తులను క్రమద్ధీకరిస్తామని చెప్పిన ప్రభుత్వం ఏ దశలోను ప్రజలను భాగస్వాములను చేయకుండా ఇప్పుడు ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ అమలు చేస్తామని చెప్పడం ప్రజలను మోసం చేయడమేనన్నారు. అధికారపార్టీ నేతల ఒత్తిడితో నిరక్షరాస్యులైన రైతుల భూములను ఇతరుల పేర్లతో నమోదు చేసుకునే అవకాశముందన్నారు. టైటిలింగ్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్‌కు అపరిమిత అధికారాలివ్వడం ప్రజల ఆస్తులను వైసీపీ నాయకులకు కట్టబెట్టేందుకేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ నాయకుల కబంధహస్తాల్లో ప్రభుత్వ భూములున్న నేపథ్యంలో పౌరహక్కులను కాలరాసే విధంగా ఉన్న ఈ యాక్ట్ ఎంత మాత్రం శ్రేయస్కరం కాదన్నారు. టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే 2వ సంతకమే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుపై చేస్తానన్న టీడీపీ అధినేత చంద్రబాబునాయుడుకు మద్దతు ప్రకటించి స్వార్జితమైన భూములను రక్షించుకోవాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో రైతు సంఘాల నాయకులు యనమదల వెంకయ్యారావు, అక్కినేని కృష్ణాజీ, తుమ్మల వీరయ్య, కలపాల రాధాకృష్ణ, దయాల రాజేశ్వరరావు, గోళ్ల శివనాగమల్లేశ్వరరావు, అవిర్నేని భవానిశంకర్, పల్లగాని వెంకటేశ్వరరావు, మండాది రవీంద్ర, ఈడే అక్కయ్య, మొవ్వా వేణుగోపాల్, నిమ్మకూరి గోవర్ధన్, బ్రహ్మయ్య, రాపర్ల మధు, తిరువీధి మరియదాసు తదితరులు పాల్గొన్నారు.



ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌కు వ్యతిరేకంగా ధర్నాలో పాల్గొన్న ఆళ్ల గోపాలకృష్ణ, మండాది రవీంద్ర, రైతు నాయకులు



చెయ్యి, కాలు విరిగి చికిత్స పొందుతున్న కార్మికురాలు

ఎన్టీటీపీఎస్‌లో లోకో ట్రైన్ ఢీకొని కార్మికురాలికి తీవ్ర గాయాలు

ఇబ్రహీంపట్నం, మే 3 : ఎన్టీటీపీఎస్‌లో కార్మికుల ప్రాణాలకు ఏమాత్రం భద్రత లేకుండా పోయింది. ప్రమాదాలు జరిగి పలువురు మృత్యువాత పడుతున్నా, క్షతగాత్రులవుతున్నా అధికారులు భద్రతా చర్యలు చేపట్టడంలో పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఈక్రమంలో శుక్రవారం కోల్ ప్లాంట్‌లో లోకో ట్రైన్ జూపూడికి చెందిన కాంట్రాక్టు కార్మికురాలు నునావత్ కోటేశ్వరి (34)ని ఢీకొట్టింది. దీంతో ఆమె తీవ్రంగా గాయపడింది. రెండు కాళ్లు, ఒక చెయ్యి విరిగిపోయింది. ప్రమాద విషయం గుత్తేదారుతో కుమ్మక్కై ఎన్టీటీపీఎస్ అధికారులు గోప్యంగా ఉంచారు. బాధితురాలిని ప్రయివేటు వైద్యశాలలో ఉంచి రహస్యంగా చికిత్స చేయిస్తున్నారు.

బాధితురాలికి న్యాయం చేయాలి : టీడీపీ

ఎన్టీటీపీఎస్‌లో ప్రమాదాలు నిత్యకృత్యం అయ్యాయి.. అధికారులు, గుత్తేదారులు కాంట్రాక్టు కార్మికుల ప్రాణాలతో చెలగాటమాడుడుతున్నారు.. శుక్రవారం జరిగిన ప్రమాదంలో బాధితురాలు పూర్తిగా అంగవైకల్యం పొందింది. ప్రమాదానికి కారణమైన వ్యక్తులపై చర్యలతో పాటు బాధితురాలికి న్యాయం చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు రామినేని రాజశేఖర్ (రాజ) డిమాండ్ చేశారు.

తెలంగాణ మద్యం స్వాధీనం

- ముగ్గురిపై కేసు నమోదు

తిరువూరు, మే 3 : మండలంలోని అక్కపాలెం గ్రామంలో గడ్డివాములో దాచిన తెలంగాణకు చెందిన 480 మద్యం బాటిళ్లను ఎస్ఈబి అధికారులు స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం స్థానిక ఎస్ఈబి స్టేషన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో సీఐ అశోక్ తెలిపిన వివరాల ప్రకారం, అక్కపాలెం గ్రామానికి చెందిన నెక్కళపు శ్రీనివాసరావు ఇంటి ఆవరణలో ఎన్నికల్లో పంచేందుకు మద్యం నిల్వచేసిన సమాచారంతో దాడిచేశామన్నారు. తెలంగాణకు చెందిన 480 మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకుని, నెక్కళపు శ్రీనివాసరావు, దినేష్‌గౌడ్‌లను అదుపులోకి తీసుకోవడం జరిగిందని, రేలుపాడికి చెందిన కిలారు రమేష్ పరారీలో ఉన్నాడని సీఐ తెలిపారు. దాడిలో ఎస్సైలు రఘు, జగ్గరావు సిబ్బంది పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న మద్యం, నిందితులతో ఎస్ఈబి అధికారులు

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	142, 151, 162
చికెన్ విత్ స్కిన్	270
చికెన్ స్కిన్‌లెస్	280



నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ.4.40

కూటమి అభ్యర్థులు గెలవాలంటూ రేమల్లె యువత పాదయాత్ర

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మే 3 : యువత భవిష్యత్తుతో పాటు రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు అన్నారు. రేమల్లె తెలుగు యువత ఆధ్వర్యంలో గ్రామం నుంచి అవుటపల్లిలోని జోసఫ్ తంబి చర్చి వరకూ శుక్రవారం కాలినడకన బయలు దేరిన యాత్రకు జెండా ఊపి ఆయన ప్రారంభించారు.



పాదయాత్ర ప్రారంభిస్తున్న రాజేశ్వరరావు

చంద్రబాబు పాలన స్వర్ణయుగం

కూటమి అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మే 3 : లోటు బడ్జెట్‌తో నూతనంగా ఏర్పడిన రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి వైపు నడిపిన ఘనత చంద్రబాబుదని, ఆయన పాలన అన్ని వర్గాలకు స్వర్ణయుగమని, ముఖ్యంగా తెలంగాణాతో సమానంగా ఉద్యోగులకు ఫిట్‌మెంట్ ఇచ్చిన ఘనత టీడీపీదేనని కూటమి అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. కె.సీతారాంపురంలో శుక్రవారం ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు. మహిళలు హారతులిచ్చి పూలవర్షంతో ఘన స్వాగతం పలికారు. టీడీపీ కూటమి మేనిఫెస్టోతో అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకూరుతుందని వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. బీసీ రక్షణ చట్టం ద్వారా బలహీనవర్గాలకు అండగా నిలచింది టీడీపీయేనన్నారు. సీపీఎస్ వారం రోజుల్లో చేస్తానంటూ హామీ ఇచ్చి మాటతప్పాడని ఎద్దేవా చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయవర్గాలు ఆలోచించాల్సిన సమయం వచ్చిందని, ప్రజలపై భారం మోపుతూ ప్రజా హక్కులను కాలరాస్తున్న అరాచకపాలనను అంతమొందించే తొలి అడుగు ఆయా వర్గాలపైనే ఉందన్నారు. రాష్ట్రాన్ని ప్రగతిబాట పట్టించగల టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి మద్దతు పలకాలని ప్రజలను కోరారు. పేద ప్రజలకు సేవలందిస్తూ గన్నవరం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చానని యార్లగడ్డ స్పష్టం చేశారు. ఈనెల 13న జరిగే ఎన్నికల్లో మొదటి ఈవీఎంలోని గాజుగ్లాసు గుర్తుకు, రెండవ ఈవీఎంలో సైకిల్ గుర్తుకు ఓటువేసి తమను గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ సమన్వయకర్త చలమలశెట్టి రమేష్‌బాబు, టీడీపీ మండల అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు, పుట్టా సురేష్, చెన్నుబోయిన నాగరాజు, ప్రొద్దుటూరు గంగరాజు, అచ్చన వెంకటేశ్వరరావు, సాంబశివరావు, చిరంజీవి, అజయ్, కామేశ్వరరావు, చౌటపల్లి భాగ్యరాజు, దంటగుంట్ల సర్పంచ్ యజ్ఞవరపు రంగారావు, బొమ్ములూరు సర్పంచ్ కాటూరి విజయభాస్కర్, బీజేపీ నేత తోట మురళీధర్, తదితరులు పాల్గొన్నారు.



కె.సీతారాంపురంలో యార్లగడ్డ వెంకట్రావుకు హారతులిచ్చి స్వాగతం పలుకుతున్న మహిళలు



పెరికీడులో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న యార్లగడ్డ సతీమణి జ్ఞానేశ్వరి

కూటమి మేనిఫెస్టోతో పేదలకు భరోసా

పేదలకు సంక్షేమ పథకాలను మొదలుపెట్టిందే టీడీపీ అని, టీడీపీ కూటమి మేనిఫెస్టోతోనే పేదలకు ఆర్థికభరోసా సాధ్యమవుతుందని టీడీపీ కూటమి అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు సతీమణి జ్ఞానేశ్వరి అన్నారు. పెరికీడు టీడీపీ, జనసేన ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఇంటింటి ప్రచారంలో ఆమె పాల్గొన్నారు. మహిళలు పూలవర్షం కురిపిస్తూ ఘనస్వాగతం పలికారు. టీడీపీ సూపర్‌సిక్స్ పథకాలతో అన్ని వర్గాలకు లబ్ధి చేకూరుతుందని వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. గన్నవరం నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి సేవలందించేందుకు రాజకీయాల్లోకి వచ్చిన తన భర్త యార్లగడ్డ వెంకట్రావును అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో రాజులపాటి శ్రీనివాసరావు, వేగిరెడ్డి పాపారావు, గొట్టాపు ప్రవీణ్, మూల్పూరి సాయికళ్యాణి, బేతాళ ప్రమీలారాణి, వడ్డిల్లి లక్ష్మి, అర్నేపల్లి సుబ్బారావు, కొత్తూరు అంజనేయులు, గిరి, తదితర టీడీపీ, జనసేన, బీజేపీ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళల సమగ్రాభివృద్ధికి టీడీపీని గెలిపిద్దాం

తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి యార్లగడ్డ సుచిత్ర

పెనమలూరు, మే 3 : మహిళల సమగ్రాభివృద్ధికి డ్వాక్రా, దీపం లాంటి అనేక పథకాలు ప్రవేశపెట్టి మహిళల పక్షపాతిగా పేరు తెచ్చుకున్న చంద్రబాబును ముఖ్యమంత్రి చేయాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి యార్లగడ్డ సుచిత్ర పేర్కొన్నారు. శుక్రవారం కానూరు శ్రీరాంనగర్‌లో జరిగిన ప్రచారయాత్రలో ఆమె స్థానిక మహిళలతో కలిసి ప్రచారం నిర్వహించారు. టీడీపీ ఇటీవల ప్రకటించిన సూపర్‌సిక్స్ మేనిఫెస్టోలోనూ మహిళలకే పెద్దపీట వేశారని, వచ్చే ఎన్నికల్లో పెనమలూరు ఎమ్మెల్యేగా కూటమి అభ్యర్థి బోడె ప్రసాద్‌ను, ఎంపీగా బాలశౌరిని గెలిపించాలని కోరారు. ఆమె వెంట సుధ, కృష్ణవేణి, జ్యోతి, సమీమా, శిరీష, పద్మ, రాజేశ్వరి, అనూష, రూప తదితరులు ఉన్నారు.



కానూరు శ్రీరాంనగర్‌లో సుచిత్ర ప్రచారం

పేదల సంక్షేమానికి టీడీపీ ప్రాధాన్యం



ఉయ్యూరు ఎన్నికల ప్రచారంలో బోడె వెంకట్రామ్, వల్లభనేని అరుణ్

ఉయ్యూరు, మే 3 : రాష్ట్రంలో కూటమి మేనిఫెస్టోలో ప్రకటించిన సంక్షేమ, అభివృద్ధి పథకాలతో పేదలు, మహిళలు, అన్ని వర్గాలకు ఎంతో మేలుకలుగుతుందని టీడీపీ పెనమలూరు అభ్యర్థి బోడె ప్రసాద్ కుమారుడు బోడె వెంకట్రామ్, జనసేన మచిలీపట్నం పార్లమెంట్ అభ్యర్థి బాల శౌరి కుమారుడు వల్లభనేని అరుణ్ అన్నారు. కూటమి అభ్యర్థుల విజయం కాంక్షిస్తూ శుక్రవారం ఉయ్యూరులో కూటమి నాయకులతో కలసి పర్య టించి ఎన్నికల ప్రచారం చేశారు. కూనపరెడ్డి వాసు, సత్యనారాయణ, గుర్నాధం, బూరెల రమణ, రమేశ్, నాగరాజు, ఖుద్దూస్, పలియాల శ్రీనివాస్, ఈడే అంజిబాబు, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబును ముఖ్యమంత్రి చేయడమే మాదిగల లక్ష్యం

విజయవాడ రూరల్, మే 3 : టీడీపీ అధినేత చంద్రబాబును ముఖ్యమంత్రి చేయడమే మాదిగల లక్ష్యమని ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి పేటేటి కిషోర్ అన్నారు. కూటమి గన్నవరం అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావును గెలిపించాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ నేతలు శుక్రవారం పాతపాడులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భగా కిషోర్ మాట్లాడుతూ, ఎబీసీడీ వర్గీకరణ పూర్తిగా రాజ్యాంగ వ్యతిరేకమని ప్రకటించిన జగన్‌ని రానున్న ఎన్నికల్లో మాదిగలు ఓడించి తీరుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు సిద్ధిల రాజా, బుజ్జవరపు రాజేష్, పేటేటి రవి కుమార్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెనమలూరు, మే 3 : యనమలకుదురులోని శివ పార్వతినగర్ 11కేవీ ఫీడరు, 11కేవీ సాయినగర్ ఫీడర్లలో శనివారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నారు. మెయింటినెన్సు పనుల కారణంగా ఉదయం ఆరు నుంచి పది గంటల వరకు యనమలకుదురు ప్రధాన గ్రామం, అవనిగడ్డ కరకట్ట, శివపార్వతి నగర్, సాయినగర్‌లలో విద్యుత్ సరఫరాలకు అంతరాయం కలుగుతుందని గుణదల విద్యుత్ ఈఈ హరిబాబు తెలిపారు.

రాష్ట్ర భవిష్యత్తు కోసం సీపీఎం, కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించండి

ఉంగుటూరు, మే 3 : దేశభవిష్యత్తుకు, దేశ వినాశనానికి మధ్య జరుగుతున్న ఈ సార్వత్రిక ఎన్నికల్లో దేశ, రాష్ట్ర భవిష్యత్తుతోపాటు ప్రజల ప్రయోజనాలే పరమావధిగా నిరంతరం కృషి చేస్తున్న సీపీఎం, కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థులను గెలిపించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు ఓటర్లకు విజ్ఞప్తిచేశారు. సీపీఐ, కాంగ్రెస్ ఆమ్‌ఆద్మీ పార్టీలు(ఇండి యావేదిక) బలపరిచిన గన్నవరం నియోజకవర్గ సీపీఎం అభ్యర్థి కళ్ళం వెంకటేశ్వరరావు, మచిలీపట్నం పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి గొల్లు కృష్ణలను గెలిపించాలని కోరుతూ శుక్రవారం మండలంలోని పెదఅవుటపల్లి, తేలప్రోలు గ్రామాల్లో వామపక్షాల నాయకులు, కార్యకర్తలు విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో సీపీఎం నాయకులు వైనరసింహారావు, టీవీ లక్ష్మణస్వామి, అజ్మీర్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీవారి గ్రామోత్సవం



హనుమాన్‌జంక్షన్, మే 3 : స్థానిక నూజివీడు రోడ్డులోని శ్రీలక్ష్మీవేంకటేశ్వస్వామి ఆలయంలోని నిర్వహిస్తున్న బ్రహోత్స వాల్లో భాగంగా శుక్రవారం కన్నుల పండువగా శ్రీవారికి ఆలయ నిర్వాహకులు గ్రామోత్సవాన్ని నిర్వహించారు. ఆలయం నుంచి బయలుదేరిన గ్రామోత్సవం జంక్షన్ నాలుగు రోడ్లులో శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామిని ప్రత్యేక వాహనంపై ఊరే గించారు. కార్యక్రమాన్ని ఆలయ ట్రస్టీ కాకాని అరుణబాబు, తవ్వా పూర్ణచంద్రరావు, ఈవో వైశ్రీనివాస్ పర్యవేక్షించారు.

యార్లగడ్డ జ్ఞానేశ్వరి ప్రత్యేక పూజలు

గన్నవరం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు సతీమణి జ్ఞానేశ్వరి గురువారం రాత్రి శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయ అర్చకులు చక్రావధానుల సీతారామాచార్యులు స్వామి వారి శేషవస్త్రంతో సత్కరించి ఆశీస్సులు అందజేశారు. ఆమె వెంట టీడీపీ మహిళ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూల్పూరి సాయికల్యాణి, జిల్లా అధికార ప్రతినిధి వడ్డిల్లి లక్ష్మి, ఆలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ సుంకర సుభాష్ చంద్రబోస్, టీడీపీ కార్యకర్తలు, తెలుగు మహిళలు, జనసేన వీరమహిళలు పాల్గొన్నారు.

టీడీపీతో అన్ని వర్గాలకు మేలు

గన్నవరం, మే 3 : గాడి తప్పిన పాలనను సన్మార్గంలో పెట్టాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని టీడీపీ సీనియర్ నేత రామినీడు బసవపూర్ణయ్య అన్నారు. మండలంలోని మాదలవారిగూడెంలో శుక్రవారం రాత్రి కూటమి అభ్యర్థులను గెలిపించాలని ఇంటింటా ప్రచారం నిర్వహించారు. సైకిల్ గుర్తుకు ఎమ్మెల్యే అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావుకి, గ్లాసు గుర్తుకు ఎంపీ అభ్యర్థి వల్లభనేని బాలశౌరిలను గెలిపించాలని కోరారు. టీడీపీ నాయకులు పిన్నిబోయిన సీతారామయ్య, బాయిన గోపాలకృష్ణ, నల్లజర్ల బెంజెమిన్, తుల్లిమిల్లి ప్రవీణ్ పాల్గొన్నారు.



మాదలవారిగూడెంలో టీడీపీ నేతల ప్రచారం

డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తం

● అధికారుల అలసత్వం ● రోడ్లపై ప్రవహిస్తున్న మురుగు

ఉయ్యూరు, మే 3 : ఉయ్యూరు నగరపంచాయతీ పరిధిలో మురుగు కాల్వల నిర్వహణ లోపంవల్ల రోడ్లపై మురుగు పొంగి ప్రవహిస్తుంది. డ్రెయిన్ల పూడిక తీతకు నోచుకోపోవడంతో ప్రధాన రహదారులపై సైతం మురుగునీరు పొంగుతుంది. నగర పంచాయతీలో శానిటరీ విభాగం చూసే శానిటరీ అసిస్టెంట్ విధినిర్వహణలో అలసత్వంతో పట్టణంలో శానిటేషన్ అంతంత మాత్రంగా ఉంటుంది. శానిటేషన్ పనులు పర్యవేక్షించడం మాని కమిషనర్ తోపాటు కారులో తిరుగుతూ కాలక్షేపం చేయడం వల్ల పారిశుధ్యం నానాటికి తీసికట్టు అన్నట్టుగా తయారవుతుందని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు.



వీరమ్మ గుడి వెనుక ప్రధాన రహదారి వెంబడి డ్రెయినేజీ నుంచి పొంగి రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు

ప్రజాదరణ మరువలేనిది

కూటమి అభ్యర్థి బోడె ప్రసాద్

పెనమలూరు, మే 3 : ఎన్నికలు సమీపించే కొద్దీ తనను నియోజకవర్గంలోని అన్ని వర్గాల ప్రజలు అమితంగా ఆదరిస్తున్నారని టీడీపీ కూటమి అభ్యర్థి బోడె ప్రసాద్ వ్యాఖ్యానించారు. శుక్రవారం పోరంకి వసంతనగర్, పద్మనాభపురం కాలనీ, నారాయణపురం కాలనీల్లో జరిగిన ప్రచారయాత్ర సందర్భంగా బోడె మాట్లాడారు.తాను ఎమ్మెల్యేగా ఉన్నా-లేకున్నా ప్రజలతో మమేకమై ఉండడంతో తనను ప్రజలు ఆదరిస్తున్నారని పేర్కొన్నారు. ఆయన వెంట అనుమోలు ప్రభాకరరావు, ఆచంట చంటి, కంచర్ల సుకన్య, హిమజ, వేమూరి స్వరూపరాణి, వినుకొండ రాజా, కంచర్ల పూర్ణ, కొమ్మినేని రాజేష్, కరుణాకర్ మాస్టర్, మేడసాని రత్నకుమారి, మల్లంపాటి విజయలక్ష్మి, మన్నెం నాగలక్ష్మి ఉన్నారు.



పోరంకిలో జరిగిన నాయీబ్రాహ్మణ ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న బోడె ప్రసాద్

పోరంకిలో బోడె హేమ, వైష్ణవి ప్రచారం..

పోరంకి బ్రహ్మంగారి చెరువు బజార్ వద్ద బోడె హేమ, వైష్ణవిలు ప్రచారయాత్ర నిర్వహించారు. చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. వచ్చే ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు బోడె ప్రసాద్‌ను, వల్లభనేని బాలశౌరిని గెలిపించాలని కోరారు. వారి వెంట అనుమోలు ప్రభాకరరావు, జరుగు చెన్న కేశవరావు, దండమూడి సాయిసుధ, బొప్పన లావణ్య, గట్టువాణి, పండమనేని శ్రీనివాస్, మేదాం ద్రపు పిచ్చయ్య, బొల్లం వీరన్‌కుమార్, వంగూరు లీలా కృష్ణ, అంకెం రాజేష్, మాణిక్యం ఉన్నారు.

నాయీ బ్రాహ్మణుల సమగ్రాభివృద్ధికి కృషి

నియోజకవర్గంలోని నాయీ బ్రాహ్మణుల సమగ్రాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని టీడీపీ కూటమి అభ్యర్థి బోడె ప్రసాద్ హామీ ఇచ్చారు. శుక్రవారం పోరంకి టీడీపీ కార్యాలయంలో జరిగిన నియోజకవర్గస్థాయి నాయీబ్రాహ్మణుల ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొని నాయీబ్రాహ్మణ నాయకులతో మాట్లాడారు. నాయీ బ్రాహ్మణుల కోరిక మేరకు వేల్పూరులో అన్ని విధాలా ఉపయోగపడేందుకు కమ్యూనిటీ హాలు నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. వచ్చే ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా, చంద్రబాబును ముఖ్యమంత్రిగా ఎన్నుకోవాలని కోరారు. ఆత్మీయ సమావేశంలో అనుమోలు ప్రభాకరరావు, వీరంకి గురుమూర్తి, పీతా గోపీచంద్, ఏపీ నాయీ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు దాక్షారపు సూరిబాబు, పెనమలూరు మార్కెట్ యార్డు డైరెక్టరు ఆకునూరు మాణిక్యం, రాష్ట్ర వాయిద్య కళాకారుల సంఘం అధ్యక్షులు అన్నవరపు రాజేశ్వరి, ఎన్టీఆర్ జిల్లా నాయీబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు పావులూరి రాంప్రసాద్, ఆకునూరు కోటేశ్వరరావు, అయోధ్య సత్యనారాయణ, శంకరరావు, వణుకూరు నాగేశ్వరరావు, వణుకూరు సురేష్‌బాబు, యలవర్తి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కూటమితో అన్ని వర్గాల అభివృద్ధి

ఉయ్యూరు : టీడీపీ, జనసేన, బీజేపీ కూటమితో అన్ని వర్గాల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి సాధ్యపడుతుందని కూటమి పెనమలూరు అభ్యర్థి బోడె ప్రసాద్ అన్నారు. బోళ్లపాడులో శుక్రవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా కూటమి అభ్యర్థులతో కలసి పర్యటించి కూటమి మేనిఫెస్టోలో ప్రకటించిన సంక్షేమ, అభివృద్ధి పథకాలు వివరించారు. మచిలీపట్నం పార్లమెంట్‌కు గాజుగ్లాసు, పెనమలూరు అసెంబ్లీకి సైకిల్‌గుర్తుపై ఓట్లువేసి విజయం చేకూర్చాలన్నారు. ఎమ్మెల్యేగా ఉండగా బోళ్లపాడులో చేసిన అభివృద్ధి పనులను గుర్తుచేశారు. పార్టీ మండల అధ్యక్షుడు యెనిగళ్ల కుటుంబరావు, గుంటక లక్ష్మారెడ్డి, మాజీ సర్పంచ్ వంగా రాజ్యలక్ష్మి, తాబేటి నరేంద్ర, నందిపాటి ప్రసాదరెడ్డి, తెలుగుయువత జిల్లా అధ్యక్షుడు దండమూడి చౌదరి, చిరంజీవి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



పోరంకిలో బోడె హేమ, వైష్ణవి ప్రచారం

దళితులపై దాడులు వివరించాలి

కోలవెన్ను (కంకిపాడు), మే 3 : వైసీపీ ప్రభుత్వ హయాంలో దళితులపై జరిగిన దాడులను దళితులకు వివరించాల్సిన అవసర ముందని టీడీపీ ఎస్సీ సెల్ విభాగం జిల్లా కార్యదర్శి బత్తుల కామేశ్వరరావు అన్నారు. మండలంలోని కోలవెన్నులో శుక్రవారం ఎస్సీ కాలనీలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కంకిపాడు మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు బండి కృష్ణబాబు, ఎస్సీ సెల్ కార్యదర్శి దొప్పలపూడి నాగేశ్వరరావు, జల్లే కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఈడుపుగల్లులో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో మాజీ ఎంపీపీ దేవినేని రాజా, సర్పంచ్ పందిపాటి ఇందిర, షేక్ షకార్, పందిపాటి సుధాకర్, చెల్లి సంగీతరావు తదితరులు పాల్గొన్నారు. తెన్నేరులో నిర్వహించిన జనసేన ఎన్నికల ప్రచారంలో జనసేన మచిలీపట్నం పార్లమెంట్ అభ్యర్థి వల్లభనేని బాలశౌరిని గెలిపించాలని కోరుతూ బాలశౌరి కుమారుడు చరణ్, నియోజకవర్గ సమన్వయకర్త ముప్పా రాజా పాల్గొన్నారు.



కోలవెన్నులో టీడీపీ ఎస్సీసెల్ నాయకుల ప్రచారం



ఈడుపుగల్లులో ఎన్నికల ప్రచారంలో దేవినేని రాజా

బ్రాయిలర్ ధరలు



అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	142, 151, 162
చికెన్ విత్ స్కిన్	270
చికెన్ స్కిన్‌లెస్	280

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ.4.40

నోబుల్ కళాశాలలో పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ : ఆర్డీవో

మచిలీపట్నం టౌన్ : మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గంలో ఎన్నికల విధులకు శిక్షణ పొందిన ఉద్యోగులు, ఉపాధ్యాయులు శనివారం నుంచి మూడు రోజుల పాటు నోబుల్ కళాశాలలో ఏర్పాటు చేసిన కేంద్రంలో ఓటు హక్కును పోస్టల్ బ్యాలెట్ ద్వారా వినియోగించుకోవచ్చని ఆర్డీవో ఎం. వాణి తెలిపారు. శనివారం పీవోలు, ఏపీవోలు, ఎంవో, ఆదివారం ఓపీవో, సోమవారం పోలీసులు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, మెడికల్ సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ల ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చన్నారు. ఫారం 12 దరఖాస్తు చేసిన వారందరూ ఓటు హక్కు వినియోగించుకునేందుకు అర్హులన్నారు. ఎవరైనా పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకోని పక్షంలో 7, 8 తేదీల్లో ఆర్డీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌లో ఓటు హక్కు వినియోగించుకోవచ్చన్నారు.



కూటమి విజయానికి కృషి చేస్తామని బాలశౌరి, రవీంద్ర సమక్షంలో ప్రతిజ్ఞ చేస్తున్న కార్యకర్తలు



పెడనలో కాగిత, బాలశౌరి రోడ్‌షో



బుద్ధప్రసాద్ సమక్షంలో జనసేన పార్టీలో చేరిన టి.కొత్తపాలెం యువత

భారీ మెజార్టీతో గెలుస్తాం

మచిలీపట్నం టౌన్, మే 3 : బందరు పార్లమెంటు నియోజకవర్గంలో ఏడు అసెంబ్లీ సీట్లలో భారీ మెజారిటీతో గెలుస్తూ రికార్డు సృష్టించబోతున్నామని మచిలీపట్నం పార్లమెంటు నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి వల్లభనేని బాలశౌరి అన్నారు. కాలేఖాన్‌పేటలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి సోడిశెట్టి బాలాజీలతో కలిసి ఎంపీ అభ్యర్థి వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యే అభ్యర్థి కొల్లు రవీంద్ర శుక్రవారం రాత్రి విస్తృతంగా పర్యటించారు. బాలశౌరి, కొల్లు రవీంద్రలను టీడీపీ, జనసేన కార్యకర్తలు గజమాలలతో సత్కరించారు. నగర టీడీపీ కార్యదర్శి పిప్పళ్ళ కాంతారావు ఆధ్వర్యంలో టీడీపీ కార్యాలయాన్ని బాలశౌరి, కొల్లు రవీంద్ర ప్రారంభించారు. కొల్లు రవీంద్ర మాట్లాడుతూ, టీడీపీ, జనసేన విజయాన్ని ఎవరూ ఆపలేరన్నారు. ఈ సందర్భంగా టీడీపీ, జనసేన విజయానికి సైనికుల్లా పనిచేస్తామంటూ ప్రతిజ్ఞ చేశారు. జనసేన నాయకులు మాదివాడ రాము, కొరియర్ శ్రీను, టీడీపీ సీనియర్ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్, టీడీపీ నగర అధ్యక్షుడు ఎండి ఇలియాస్ పాషా, నాని, తెలుగు రైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ, నాయకులు వర్ల మూడి సుబ్బారావు, నారగాని కృష్ణ పాల్గొన్నారు.

కొల్లు పునీత్ ప్రచారం

మచిలీపట్నం టౌన్ : నిరుద్యోగ యువతకు చంద్రబాబు పాలనలోనే ఉద్యో గావకాశాలు లభిస్తాయని కొల్లు రవీంద్ర కుమారుడు కొల్లు పునీత్ అన్నారు. 45వ డివిజన్ శిడింబి అగ్రహారంలో శుక్రవారం రాత్రి కొల్లు పునీత్ ఇంటింటికీ తిరిగి చంద్రబాబు ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. సంపద సృష్టించే నాయకుడు చంద్రబాబు అన్నారు. పల్లపాటి అభినవ్, గంజాల రవి, పి.వి. ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.



గ్యాస్ సిలిండర్లతో ప్రచారం

మచిలీపట్నం టౌన్ : మహిళలకు చంద్రబాబు ఉచితంగా ఏడాదికి మూడు గ్యాస్ బండలు , ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, మహిళలకు ప్రతినెలా రూ.1500 ఆర్థిక సా యం అందిస్తారని టీడీపీ జిల్లా ప్రచార కార్యదర్శి పి.వి.ఫణికుమార్ అన్నారు. ఈడేపల్లిలో తెలుగు మహిళలు మూడు వంటగ్యాస్ సిలెండర్లతో ప్రదర్శన నిర్వహించారు. గంజాల రవికుమార్, వాడపల్లి మహేష్, కోమటి వెంకటేశ్వరరావు, బి పాండురంగారావు తదితరులు చంద్రబాబు ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను వివరించారు.

బుద్ధప్రసాద్ మనుమరాలు అక్షర ప్రచారం

మోపిదేవి : బుద్ధప్రసాద్ మనుమరాలు శీలం అక్షర మోపిదేవిలో ఇంటింటికి వెళ్లి గాజు గ్లాసు గుర్తుకు ఓటు వేసి బాబు నాయకత్వాన్ని బలపర్చాలన్నారు. కూటమి నాయకులు రావి దుర్గావాణి, మెడబలిమి మల్లిఖార్జున రావు, నడకుదుటి జనార్ధనరావు, రావి నాగేశ్వరరావు, కొమ్ము పవన్ కుమార్, మోర్ల జయలక్ష్మి, కోసూరు రామాంజనేయులు, రావి రత్నగిరి, పూషడపు రత్నగోపాల్, మెరకనపల్లి నరేష్ తదితరులు పాల్గొన్నారు.





కాగిత సోదరి శైలజ ప్రచారం

పెడన రూరల్ : కాగిత కృష్ణప్రసాద్ సోదరి శైలజ కొంకేపూడిలో విస్తృత ప్రచారం చేశారు. మండల పార్టీ అధ్యక్షుడు శలపాటి ప్రసాద్, జడ్పీటీసీ సభ్యుడు అర్జా నగేష్, ఎంఎంసీ చైర్మన్ గుడిశేవ రామారావు, ప్రధాన కార్యదర్శి శీరం ప్రసాద్, ఉమ్మడిశెట్టి శ్రీరామ మూర్తి, వంశీ, కాగిత వాసు తదితరులు పాల్గొన్నారు.

ఆలోచించి ఓటు వేయండి

పెడన : ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని, పొరపాటున వైసీపీకి ఓటు వేస్తే ప్రజల భూములు, ఆస్తులు జగన్ సొంతమైపోతాయని జనసేన ఎంపీ అభ్యర్థి వల్లభనేని బాలశౌరి హెచ్చరించారు. పెడన నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కాగిత కృష్ణప్రసాద్, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావుతో కలసి శుక్రవారం పెడన రోడ్‌షోలో ఆయన పాల్గొన్నారు. బాలశౌరి మాట్లాడుతూ, చేనేతను తీవ్ర సంక్షోభంలోకి నెట్టిన వైసీపీకి కార్మికులు గట్టి గుణపాఠం చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. కాగిత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ, వైసీపీ పాలకులు పెడన నియోజకవర్గాన్ని అవినీతి, అక్రమాలకు అడ్డాగా మార్చుకున్నారని దుయ్యబట్టారు. యక్కల శ్యామలయ్య, అబ్దుల్ ఖయూం, వహబ్‌ఖాన్, చందన నారాయణరావు, రహమాన్ బేగ్, మట్టా శివపావని, మామిడి లక్ష్మీనారాయణ గుప్తా, బళ్ళ ప్రసాద్, ఊటుకూరి మోహనరావు, బెజవాడ నాగరాజు, హమీదుల్లా, ఊటుకూరి శ్రీగిరి పాల్గొన్నారు.

నాగాయలంకలో రోడ్‌షో

నాగాయలంక : వల్లభనేని బాలశౌరి, బుద్ధప్రసాద్‌లను గాజు గ్లాసు గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరుతూ బాలశౌరి కుమారుడు అనుదీప్, మండలి బుద్ధప్రసాద్ నాగాయలంకలో శుక్రవారం రోడ్డు షో నిర్వహించారు. మెండు లక్ష్మణరావు, మండవ బాలవర్ధిరావు, తలశిల స్వర్ణలత, భోగాది రమాదేవి, శీలం అశ్విన్ కుమార్, ఉప్పల ప్రసాద్, తలశిల నాని, చిల కలపూడి పాపారావు, గుడివాక శివరావు, బండ్రెడ్డి మల్లిఖా ర్జునరావు, లకనం నాగాంజనేయులు, ఆలూరి శ్రీనివాసరావు, వర్రే రాంబాబు, బండ్రెడ్డి బాపిరెడ్డి, ముమ్మారెడ్డి శ్రీనివాసరావు, కొక్కిలిగడ్డ నాగరాజు, భోగాది శివ విష్ణు, బండ్రెడ్డి హరి, బావిరెడ్డి వెంకటేశ్వరరావు, కనగాల రాధ, మేడికొండ విజయ్, తలశిల రామకృష్ణ పాల్గొన్నారు. **అవనిగడ్డ :** టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు అవనిగడ్డలో ఇంటింటి ప్రచారాన్ని శుక్రవారం నిర్వహించారు. జనసేన పార్టీ నేతలు మత్తి వెంకటేశ్వరరావు, గుడివాక శేషుబాబు, బచ్చు వెంకటనాథ్, అన్నపరెడ్డి రాందాసు, చెన్నగిరి సత్యనారాయణ, తెలుగుదేశం నేతలు యాసం చిట్టిబాబు, కొల్లూరి వెంకటేశ్వరరావు, షేక్ బాబావలి, మొగల్ మొరాద్, బండే రాఘవ, హరి పాల్గొన్నారు. **కోడూరు :** బాలశౌరి, మండలి బుద్ధప్రసాద్ విజయాన్ని కాంక్షిస్తూ ఉల్లిపాలెంలో మండలి కోడలు సాయి సుప్రియ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బండే శ్రీనివాసరావు, మర్రే గంగయ్య, వడుగు నాగబాబు, సుంకర లక్ష్మి, కొండవీటి సునీత, పూతబోయిన కరుణ కుమార్, బొలిశెట్టి విఠల్ రావు, బడే భావన్నారాయణ, గుడిసేవ సూర్యనారాయణ, రాసంశెట్టి నాగరాజు, పిల్లి మల్లిఖార్జునరావు, గోగినేని సోమశేఖరరావు, వేములపల్లి రాజేష్, కాగిత రామారావు, కోట రాంబాబు, అప్పికట్ల రవీంద్ర పాల్గొన్నారు. **ఘంటసాల :** ఎంపీ అభ్యర్థి వల్లభనేని బాలశౌరి, అసెంబ్లీ అభ్యర్థి మండలి బుద్ధప్రసాద్‌లను గెలిపించాలని కోరుతూ శుక్రవారం దాలిపర్రు గ్రామంలో బుద్ధప్రసాద్ కుమార్తెలు అవని, కృష్ణప్రభ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాష్ట్రాభివృద్ధికి కూటమి అభ్యర్థుల గెలుపు ఎంతో అవసరమని తెలిపారు. టీడీపీ నాయకులు పరుచూరి సుభాష్ చంద్రబోస్, అయినపూడి భాను ప్రకాష్, బండి పరాత్పరరావు, మిక్కిలినేని మధు, గుత్తికొండ కళ్యాణ్, యార్లగడ్డ వీరభద్రరావు, మాజీ సర్పంచ్‌లు పైడిపాముల నెహ్రూ, ఆరుంబాక రవి, కుంపటి ఉదయ్ తదితరులు పాల్గొన్నారు. **నాగాయలంక :** మండల శ్రీ కృష్ణదేవరాయ కాపు సంక్షేమ సంఘం అధ్యక్షులు భోగాది సోమశేఖర్ (చిన్నారి) ఎదురుమొండి పంచాయతీలోని జింకపాలెంలో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వల్లభనేని బాలశౌరి, మండలి బుద్ధప్రసాద్‌లను గెలిపించేందుకు గాజు గ్లాసు గుర్తుపై ఓట్లు వేయాలని కోరారు. తోట నాగేశ్వరరావు, ఆకుల దుర్గాప్రసాద్, పేర్ల బాబీ, పుల్లుగుజ్జు అక్షయ్, పులుగుజ్జు వెంకటేశ్వరరావు, కారంకి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

టి.కొత్తపాలెం యువత జనసేనలో చేరిక

అవనిగడ్డ : వైసీపీ అరాచక పాలన అంతం పలికేందుకు యువత ముందుకు రావటం అభినందనీయమని మండలి బుద్ధప్రసాద్ అన్నారు. నాగాయలంక మండలం టి.కొత్తపాలెం గ్రామ యువత, పెద్ద సంఖ్యలో వైసీపీని వీడిని జనసేన పార్టీలో చేరారు. లేబాక కొండలు, బండ్రెడ్డి నాని, దుట్టా సుబ్బారావు, బండ్రెడ్డి స్వామి నాయుడు, ముమ్మారెడ్డి నాగమల్లేశ్వరరావు, రేమాల నరసింహారావు, రేమాల శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, బండ్రెడ్డి రామయ్య, కోటేశ్వరరావు, మత్తి శివయ్య, అద్దంకి మాధవ, వర్రే బాబురావులతోపాటుగా 50 కుటుంబాలు జనసేన పార్టీలో చేరారు. బాలశౌరి కుమారుడు అనుదీప్, జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి మండలి రాజేష్, కటికల అప్పారావు, బండ్రెడ్డి హరి తదితరులు పాల్గొన్నారు.



పల్లెవానిమాలపల్లి వాసులతో మాట్లాడుతున్న ఎన్ఆర్ఐలు

మంచినీటి సమస్య తీర్చే బాధ్యత నాది

● ఎన్ఆర్ఐ వెంకట్రావు

ఘంటసాల : పల్లెవాని మాలపల్లిలో మంచినీటి సమస్య పరిష్కరించే బాధ్యత తనదేనని ఎన్ఆర్ఐ, ప్రొఫెసర్ మూల్పూరి వెంకట్రావు అన్నారు. ఘంటసాల గ్రామంలోని పలు ప్రాంతాల్లో ఎన్ఆర్ఐలు మూల్పూరి వెంకట్రావు, గొర్రెపాటి రంగనాథ్‌బాబు చిలకలపూడి గ్రామ శివారు పల్లెవానిమాలపల్లి, ఘంటసాల శివారు పిడుగువాని మాల పల్లి, మల్లంపల్లి రోడ్డు, కొత్త కాలనీ తదితర ప్రదేశాల్లో ప్రచారం నిర్వహించారు. గొర్రెపాటి వెంకట రామకృష్ణ, అయినపూడి భాను ప్రకాష్, బండి పరాత్పరరావు, దిరిశం వెంకట్రావు, బుల్లా కిషోర్, కర్రా వెంకటేశ్వరరావు, జనసేన నాయకులు యార్ల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. **చల్లపల్లి :** బుద్ధప్రసాద్ అల్లుడు, ప్రవాస భారతీయుడు కనపర్తి అవనీంద్ర శుక్రవారం విస్తృత ప్రచారం చేశారు. చల్లపల్లి దళితవాడ, ఎస్టీ కాలనీల్లో ఇంటింటికీ తిరిగి బాలశౌరి, బుద్ధప్రసాద్‌లను గెలిపించాలని కోరారు. పైడిపాముల స్వప్న, కొడాలి కార్తీక్ - అంజలి దంపతులు, కొడాలి శాంతారావు ఆయనను దుశ్శాలువాలతో సత్కరించారు. లక్ష్మీపురం, పాతమాజేరు, వెలివోలు, వక్కలగడ్డ, పురిటిగడ్డ, యార్లగడ్డ గ్రామాల్లో ముమ్మరంగా ప్రచారం జరిగింది.

యలవర్తి ప్రచారం



గుడివాడ : తెలుగుదేశం పార్టీ విజయాన్ని ప్రజలు ఎప్పుడో నిర్ణయించారని, దానిని ఆపే శక్తి ఎవరికి లేదని మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం 4, 13 వార్డుల్లో గుడివాడ టీడీపీ అభ్యర్థి వెనిగండ్ల రాము గెలుపు కోరుతూ ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఉమ్మడి మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. 16వ వార్డులో టీడీపీ ఎన్నికల కార్యాలయాన్ని అంగడాల వెంకటేశ్వరరావు ప్రారంభించారు. తెలుగు మహిళ పట్టణాధ్యక్షురాలు యార్లగడ్డ సుధారాణి, నాయకులు ముళ్లపూడి రమేష్ పాల్గొన్నారు. **పామర్రు :** కురుమద్దాలి గ్రామంలో కుమార్‌రాజా సతీమణి విశ్రమ శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.



అతుల్ కుమార్ అంజన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రైతు సంఘం నేతలు

అతుల్ కుమార్ అంజన్ మృతి రైతు లోకానికి తీరని లోటు

చల్లపల్లి, మే 3 : ఆల్ ఇండియా కిసాన్ సభ జాతీయ ప్రధాన కార్యదర్శి అతుల్ కుమార్ అంజన్ మృతి రైతు లోకానికి తీరని లోటని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హనుమానుల సురేంద్ర నాథ్ బెనర్జీ పేర్కొన్నారు.

చల్లపల్లిలోని చండ్ర రాజేశ్వరరావు వికాస్ కేంద్రంలో అతుల్ కుమార్ అంజన్ సంతాప సభ రైతు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం జరిగింది. ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. సురేంద్రనాథ్ బెనర్జీ మాట్లాడుతూ అతుల్ కుమార్ అంజన్ ఏఐఎస్ఎఫ్ లక్నో యూనివర్సిటీ చైర్మన్‌గా, ఎస్ఎఫ్‌కు ఉత్తరప్రదేశ్ ప్రధాన కార్యదర్శిగా, ఏఐఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షుడిగా ఆల్ ఇండియా కిసాన్ సభ జాతీయ ప్రధాన కార్యదర్శిగా, సీపీఐ జాతీయ కార్యదర్శివర్గ సభ్యులుగా అనేక దశాబ్దాలు భారత కమ్యూనిస్టు పార్టీకి సేవలందించిన మహనీయుడన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి గుత్తికొండ రామారావు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్ బాబు, రైతు సంఘం నాయకులు వేమూరి రత్నగిరిరావు, మాలేంపాటి కోటేశ్వరరావు, కొర్రపాటి ముఖర్జీ, కొల్లూరు శ్రీధర్, నక్కా శ్రీనివాసరావు, సిద్దాబత్తుల బాలయ్య, చండ్ర సుబ్బారావు, మల్లుపెద్ది రాజా, ఆర్ఎంపీ శేషు తదితరులు పాల్గొన్నారు.



369 మద్యం బాటిళ్లు స్వాధీనం

మోపిదేవి, మే 3 : మోపిదేవి ప్రజాశక్తినగర్ కాలనీలో అక్రమంగా నిల్వ ఉంచిన 369 మద్యం క్వార్టర్ బాటిళ్లను స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సత్యనారాయణ తెలిపిన వివరాల మేరకు మోపిదేవి ప్రజాశక్తి నగర్ కాలనీకి చెందిన కోట మద్దిరామయ్య వద్ద అక్రమంగా నిల్వ ఉంచిన ఓటి 144 బాటిళ్లు, హైవార్డ్స్ 47, హైదరాబాద్ బ్లూ 87, క్లాసిక్ బ్లూ - 95 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనపర్చుకున్నట్లు తెలిపారు. మద్యం బాటిళ్లతోపాటు నిల్వ ఉంచిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

వర్లను గెలిపించుకుందాం

తోట్లవల్లూరు : చాగంటిపాడులో టీడీపీ కార్యకర్తలు శుక్రవారం ఎమ్మెల్యే అభ్యర్థి వర్ల కుమార్ రాజా గెలుపు కోసం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మట్టా అమృత బాబు ఆధ్వర్యంలో కార్యకర్తలు సైకిల్ గుర్తుకు ఓటేసి వర్ల కుమార్ రాజాను, గాజుగ్లాసు గుర్తుపై ఓటేసి వల్లభనేని బాలశౌరిని గెలిపించాలని ఓట్లు అడిగారు.



నయవంచన పుస్తకావిష్కరణ

గుడివాడ : ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం ఆధ్వర్యంలో ప్రచురితమైన పదేళ్ల బీజేపీ పాలనపై నయవంచన - దారుణ మోసాలు పుస్తకాన్ని శుక్రవారం సుందరయ్యభవన్‌లో సీపీఎం నాయకులు ఆర్‌సిపి రెడ్డి ఆవిష్కరించారు. మోదీ మాటలు విని ప్రజలు మళ్లీ మోసపోకూడదనే ఉద్దేశ్యంతో పౌరహక్కుల సంఘం ఈ పుస్తకాన్ని తీసుకువచ్చిందన్నారు. ఐద్వా కార్యదర్శి పి.రజిని, నాయకులు పి.వీరమ్మ, పల్లపు ప్రభుదాసు పాల్గొన్నారు.

వృద్ధులకు కొల్లు ఫౌండేషన్ సేవలు

మచిలీపట్నం టౌన్ : మండుటెండలో పింఛన్ల కోసం బ్యాంకుల వద్ద ఉన్న వృద్ధులకు కొల్లు ఫౌండేషన్ శుక్రవారం మజ్జిగ, అంబలి అందించారు.

టీడీపీలోనే ఉన్నా : ఇక్బాల్ బాషా

పెడన : తాను వైసీపీలో చేరినట్టు వస్తున్న వార్తల్లో వాస్తవం లేదని 17వ వార్డుకు చెందిన సీనియర్ టీడీపీ నాయకుడు ఎండి ఇక్బాల్ బాషా పేర్కొన్నారు. తాను తెలుగుదేశం పార్టీలోనే కొనసాగుతున్నానన్నారు. ఎంపీ అభ్యర్థి బాలశౌరి, ఎమ్మెల్యే అభ్యర్థి కాగిత కృష్ణప్రసాద్‌ల గెలుపు కోసం తన వంతు కృషి చేస్తానన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు, పశువుల పాకలు దగ్ధం

కూచిపూడి : విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా పెడసనగల్లులో శుక్రవారం సిరిపురపు మీనా కుమారికి చెందిన పశువుల పాక, కోడే శేషుకు చెందిన ఒంటినిట్టాడి ఇల్లు, రెండు గడ్డి వాములు దగ్ధమయ్యాయి. రెండు లక్షల రూపాయల మేర ఆస్తి నష్టం సంభవించింది. ఇన్‌చార్జ్ అగ్నిమాపక అధికారి శ్రీనివాసరావు నేతృత్వంలోని సిబ్బంది మం టలను అదుపుచేశారు.

గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు దగ్ధం

మచిలీపట్నం టౌన్ : బందరు మండలం తాళ్లపాలెం శివారు బోట్లవానిపాలెంలో శుక్రవారం వంట గ్యాస్ సిలెండర్ పేలి ఇల్లు దగ్ధమైంది. ఇంట్లో వంట చేస్తున్న నాగమల్లేశ్వరమ్మ తన భర్తను పిలిచేందుకు గుడి వద్దకు వెళ్ళింది. గుడి వద్ద ఉన్న భర్త సుబ్రహ్మణ్యాన్ని పిలిచి తీసుకువచ్చేలోగా గ్యాస్ సిలెండర్ పేలి ఇల్లు దగ్ధమైంది. పక్కనే ట్రాన్స్‌ఫార్మర్ ఉండటంతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. అదృష్టవశాత్తు ఇంట్లో ఎవరూ లేకపోవడం వల్ల పెనుప్రమాదం తప్పింది. ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. ఆస్తినష్టం రూ. 2 లక్షల వరకు ఉంటుందన్నారు.



చల్లపల్లిలో పోలీసు కవాతు

చల్లపల్లి, మే 3 : ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహిస్తామని చల్లపల్లి సీఐ సిహెచ్.నాగప్రసాద్ తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం సాయం త్రం చల్లపల్లిలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో కవాతు నిర్వహించారు. సీఐ నాగప్రసాద్ మాట్లాడుతూ, శాంతి భద్రతల పరిరక్షణ, ప్రశాంత ఎన్నికల నిర్వహణ ధ్యేయంగా పోలీసుశాఖ పనిచేస్తుందన్నారు. గ్రామాల్లో అదనపు బలగాలు అనునిత్యం సిద్ధంగా ఉంటాయనీ, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు ఎదురైనా వెంటనే పరిస్థితి అదుపు చేసేందుకు పోలీసుశాఖ నిత్యం అప్రమత్తంగా ఉంటుందని తెలిపారు. సమస్యాత్మక, అతి సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టామన్నారు. పోలింగ్ మొదలై ముగిసే వరకు, ఫలితాలు వచ్చే వరకు పోలీసుశాఖ పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉంటుందన్నారు. రాజకీయ వైరుధ్యాల ను దృష్టిలో ఉంచుకుని ఎవరైనా అవాంఛనీయ సంఘటనలకు పాల్పడే ప్రయత్నం చేస్తే పోలీసుశాఖ వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. చల్లపల్లి, ఘంటసాల, మోపిదేవి ఎస్ఐలు సిహెచ్.చిన్నబాబు, ప్రతాపరెడ్డి, సత్యనారాయణ పోలీసులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

కూచిపూడి : గూడపాడు గ్రామంలో వివాహిత ఈడే దుర్గాభవాని గురువారం రాత్రి ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. భర్త ఈడే సాంబశివరావు, అత్త ఈడే దుర్గ, ఆడపడుచు సామ్రాజ్యం వేధింపుల కారణంగా తన కుమార్తె మృతి చెందినట్లు తల్లి కొండేటి లక్ష్మి కూచిపూడి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మచిలీపట్నం ప్రభుత్వాసు పత్రికి తరలించి కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై టి.శ్రీనివాస్ తెలిపారు.

పవన్ కల్యాణ్ పర్యటన విజయవంతం చేయాలి : యాసం

అవనిగడ్డ రూరల్ : జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ శనివారం అవనిగడ్డ పర్యటనను విజయవంతం చేయాలని కోరుతూ మండల టీడీపీ అధ్యక్షుడు యాసం చిట్టిబాబు ఆధ్వర్యంలో శుక్రవారం పులిగడ్డలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. చిట్టిబాబు మాట్లాడుతూ ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే ప్రజల సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. బచ్చు శ్రీహరి పాల్గొన్నారు.

గుండెపోటుతో కానిస్టేబుల్ వెంకట నారాయణ మృతి



తాడంకి(పమిడిముక్కల), మే 3 : ఉయ్యూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న జొన్నలగడ్డ వెంకట నారాయణ (54) గురువారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. వెంకటనారాయణ స్వగ్రామం తాడంకిలో ఆయన మృతదేహానికి శుక్రవారం పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. వెంకటనారాయణ మృతదేహాన్ని కంకిపాడు సీఐ శ్రీనివాసరావు, రూరల్ ఎస్సై అవినాశ్, పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు జైపాల్, ప్రతినిధులు బెనర్జీబాబు, సురేంద్ర, గ్రామ సర్పంచ్ జంపాన ధనలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు శ్రీలక్ష్మి సందర్శించి నివాళులర్పించారు. అంత్యక్రియల నిమిత్తం ప్రభుత్వం రూ. 25,000 ఆర్థిక సహాయం అందజేశారు.



పవన్ రాకతో రోడ్డుకు మోక్షం

● ఫ్లైఓవర్‌పైన గోతులను పూడ్చారు
● మూడు థియేటర్ల వద్ద తారు పోశారు!

గుడివాడ : జనసేన అధినేత పవన్ కల్యాణ్ శనివారం గుడివాడ వస్తుండడంతో ఐదేళ్లుగా మరమ్మత్తులకు నోచుకోని రహదారికి మోక్షం లభించింది. నిన్నటి వరకు ఏజేకే మున్సిపల్ పాఠశాల నుంచి ఫ్లైఓవర్ చివరి వరకు రహదారి అస్తవ్యస్తంగా ఉండేది. రోడ్డు ప్రమాదాలు జరిగి పలువురు గాయాలయ్యారు. టీడీపీ నాయకులు, సామాజికవేత్తలు పలుమార్లు అధికారుల దృష్టికి సమస్యను తీసుకువచ్చినా స్పందించలేదు. ఈ రహదారిలో శనివారం పవన్ కల్యాణ్ రోడ్‌షో నిర్వహించి నెహ్రూచౌక్ సెంటర్‌లో జరిగే బహిరంగ సభలో పాల్గొననున్నారు. పవన్ రాకతో వణుకుపుట్టిన వైసీపీ పాలకులు హుటాహుటిన మూడు థియేటర్ల గోతులను శుక్రవారం యుద్ధప్రాతిపదికన పూడ్చారు. ఫ్లైఓవర్‌పై చిన్న చిన్న గోతులను సైతం పూడ్చారు. దీంతో పట్టణ ప్రజలు అవాక్కయ్యారు.

కూటమి అభ్యర్థుల గెలుపుతోనే పేదల అభ్యున్నతి : దాసరి రాము

అవనిగడ్డ : కూటమి అభ్యర్థుల విజయం ద్వారానే పేదల అభ్యున్నతి సాధ్యమవుతుందని తెలగ, బలిజ, కాపు ఐక్య వేదిక కన్వీనర్ దాసరి రాము అన్నారు. అవనిగడ్డలో నియోజకవర్గ జనసేన అభ్యర్థి మండలి బుద్ధప్రసాద్‌ను రాము మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ అణచివేతకు గురైన వర్గాలకు అండగా నిలబడే ప్రతినిధులుగా అవనిగడ్డ నియోజకవర్గ అభ్యర్థి మండలి బుద్ధప్రసాద్, ఎంపీ అభ్యర్థి మండలి బుద్ధప్రసాద్ పని చేస్తారని, వారిని గెలిపించేందుకు అన్ని వర్గాలు ఏకం కావాలని కోరారు. లకనం నాగాంజనేయులు, మాచవరపు ఆదినారాయణ, కొల్లూరి వెం కటేశ్వరరావు, లుక్కా పిచ్చియ్య, షేక్ బాబావలి, మొగల్ మురాద్, యాసం చిట్టిబాబు, గుడివాక శేషుబాబు, మర్రే గంగయ్య, చిలకలపూడి పాపా రావు, బాదర్ల లోలాక్షుడు, నక్కా విజయబాబు, ఆర్యవైశ్య ప్రముఖులు మానేపల్లి రాజేంద్ర ప్రసాద్, మాజీ ఎంపీపీ దిడ్ల ప్రసాద్, మొగావత్ గోపి, మేడికొండ విజయ్, దిరిశం బాలకోటయ్య తదితరులు పాల్గొన్నారు.



‘కూలీలు, భవన నిర్మాణ కార్మికులు, ఉద్యోగులు, మహిళలు ఇలా ప్రతి ఒక్కరూ నేనే గెలవాలని కోరుకుంటున్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో వివిధ వర్గాలు చవిచూస్తున్న భారాలు.. వారిలో తీవ్ర వ్యతిరేకతను కలిగిస్తున్నాయి. నేను ఈసారి 30 వేల మెజారిటీకి తగ్గకుండా గెలుస్తా. విజయవాడ తూర్పు నియోజకవర్గంలో మరోమారు పసుపు జెండా ఎగురవేస్తా’ అని విజయవాడ తూర్పు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి గద్దె రామ్మోహన్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచారం అనంతరం భోజన విరామ సమయంలో గద్దె రామ్మోహన్ తో ‘ఆంధ్రజ్యోతి’ ఇంటర్వ్యూలో మాట్లాడారు. నియోజకవర్గం ప్రజలకు ఇస్తున్న హామీలు, ప్రచార సరళి, కూటమి భాగస్వామ్య పక్షాల సహకారం, నియోజకవర్గంలో ప్రత్యర్థుల సాగించిన వ్యవహారాలు, నియోజకవర్గ ప్రధాన సమస్యలపై తన వైఖరిని గద్దె చెప్పారు. - విజయవాడ, ఆంధ్రజ్యోతి

- మెజారిటీ 30 వేలకు తగ్గదు. మా వాళ్ల లెక్కఅయితే 60 వేలు
- తాగునీరు, రోడ్లు, డ్రెయినేజీ, ట్రాఫిక్ సమస్యలపై ప్రత్యేక దృష్టి
- కొండ ప్రాంతాల్లో నిరవధికంగా 5 గంటల పాటు తాగునీరు
- శాశ్వత ప్రాతిపదికన మెట్లు, రెయిలింగ్, సిమెంట్ రోడ్ల నిర్మాణం
- కృష్ణలంకలో ఇళ్ల పట్టాల క్రమబద్ధీకరణ, పక్కా ఇళ్ల నిర్మాణం చేపడతా
- సామాజికవర్గాలు, కూలీలు, భవన నిర్మాణ కార్మికులు, ఉద్యోగులు నా వెంటే ఉన్నారు

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

తూర్పున జెండా ఎగరేస్తాం..



తూర్పు నియోజకవర్గ కూటమి అభ్యర్థి గద్దె రామ్మోహన్

ప్రచారం ఎలా జరుగుతోంది? ఓటర్ల నుంచి ఎలాంటి స్పందన వస్తోంది?

నేను ఏడు ఎన్నికలను చూశాను. ఆయా ఎన్నికల ప్రచారాల్లో ఎన్నడూ చవిచూడని రుచిని ఆస్వాదిస్తున్నాను. ప్రచారంలో నేను, నా సతీమణి, మా అబ్బాయిలు ఉన్నారు. ప్రజల నుంచి వస్తున్న స్పందన అనూహ్యంగా ఉంది. ఉద్యోగులు, వ్యాపారాలు నన్ను ఆశీర్వదిస్తున్నారు. ప్రజలు ఇంతగా బ్రహ్మరథం పట్టడం మునుపెన్నడూ లేదు. ఈ ఎన్నికల ప్రచారం నా జీవితంలో మరిచిపోనిది.

నియోజకవర్గ ప్రజలకు మీరు ఎలాంటి హామీలు ఇస్తున్నారు ?

మేము అధికారంలోకి రాగానే రోజుకు 5 గంటల పాటు నిరవధికంగా నీళ్లు వచ్చేలా చేస్తాను. **గుణదల** కొండ ప్రాంతాలకు శాశ్వత ప్రాతిపదికన మెట్ల నిర్మాణం చేపడతాను. పెద్దవాళ్లకు ఇబ్బంది లేకుండా ఉండటానికి ఆ మెట్లకు రెయిలింగ్ కూడా ఏర్పాటు చేస్తాం. **కృష్ణలంకలో** కృష్ణానదీ తీరాన ఉన్న కచ్చా, రేకుల ఇళ్ల స్థానంలో పక్కా ఇళ్లు నిర్మించాలన్నది నా ఆలోచన. దీని కోసం కేంద్ర ప్రభుత్వ సహాయం కూడా తీసుకుంటాం. ఈ ప్రాంతంలో ఉంటున్న వారి ఇళ్ల పట్టాలను రెగ్యులర్ చేసిన తర్వాత అందులో పక్కా ఇళ్ల కోసం చర్యలు తీసుకుంటాను. **పటమటలో** అండర్ డ్రైనేజీ గ్రౌండ్ వ్యవస్థ అధ్వానంగా ఉంది. ఇళ్లలోని మురుగు రోడ్లమీదకు వస్తోంది. ఈ సమస్యను వైసీపీ ప్రభుత్వం పక్కన పెట్టేసింది. టీడీపీ హయాంలో స్టామ్ వాటర్ డ్రెయినేజీ పనుల కోసం ఎల్అండ్‌టీకి పనులు అప్పగించాం. వైసీపీ ప్రభుత్వం ఆ సంస్థను పంపేసింది. అధికారంలోకి మళ్లీ స్టామ్ వాటర్ డ్రెయినేజీ పనులు ప్రారంభించేలా చేస్తాం.

ప్రచారానికి మోదీ, పవన్ వస్తారు

ఈ నెల 8వ తేదీన ప్రధాని మోదీ విజయవాడ తూర్పు నియోజకవర్గంలో రోడ్డు షో నిర్వహిస్తారు. పవన్‌కల్యాణ్‌ను కూడా ఒకరోజు తూర్పులో పాల్గొనటానికి రావాల్సిందిగా ఆహ్వానించాం. వంగవీటి రాధాకృష్ణ శనివారం నుంచి ప్రచారం నిర్వహిస్తున్నారు. దర్శిపేట నుంచి క్రీష్ణలంక ప్రాంతం ప్రచారంలో పాల్గొంటున్నారు.

మీ కూటమి భాగస్వామ్య పక్షాలు మీకు సహకరిస్తున్నాయా?

జనసేన, బీజేపీల నుంచి నాకు పూర్తి సహకారం ఉంది. జనసేనకు చెందిన నాయకులు నా వెంటే నడుస్తున్నారు. పెద్ద సంఖ్యలోని వారి కార్యకర్తలు నా ప్రచారంలో ర్యాలీ అవుతున్నారు. బీజేపీకి చెందిన మొత్తం కార్యకర్తలు నా ప్రచారంలో పాల్గొంటున్నారు.

మీ ప్రత్యర్థి దేవినేని అవినాష్ బలం, బలహీనతలు తెలుసుకుని వ్యూహాలు అమలు చేస్తున్నారా?

నా ప్రత్యర్థి బలవంతుడేమీ కాదు. ప్రజల్లో చాలా బలహీనుడు. తూర్పు నియోజకవర్గ ప్రజలు శాంతిని కోరుకుంటున్నారు. కోరి రౌడీ మూకలను గెలిపించుకోవాలనుకోవటం లేదు. మా పార్టీ నాయకుడు చెన్నుపాటి గాంధీపై కూడా దాడి చేసి కన్ను పోగొట్టారు. ఎక్కడపడితే అక్కడ వైసీపీ నాయకులు దందాలకు పాల్పడుతున్నారు. ఇలాంటి వారిని దగ్గర పెట్టుకున్న వ్యక్తిని ప్రజలు గెలిపించాలనుకోవటం లేదు. నా పని నేను చేసుకుని వెళుతున్నా.

ఆటోనగర్‌ను తరలించాలని ప్రజలు బలంగా కోరుకుంటున్నారు కదా! ఈ సమస్యపై మీరు ఎలాంటి హామీ ఇస్తారు?

ఆటోనగర్ సంఘాల అభీష్టం మేరకు, స్థానిక ప్రజలకు ఇబ్బంది లేకుండా ఉండే మార్గం ఏమైనా ఉంటే అదే చేస్తాను. వైసీపీ ప్రభుత్వంలో ఆటోనగర్‌ను తరలించేస్తామన్నారు. సగం డబ్బులు కట్టమన్నారు. దీనికి సంఘాలు వ్యతిరేకించాయి. ఆటోనగర్‌లోకి వాహనాలు వెళ్లడం, ట్రాఫిక్ ఇబ్బందులు కూడా సమస్యగానే ఉంది. అది సంఘాలకు కూడా తెలుసు. ఆటోనగర్ సంఘాలు ఏవైనా ప్రణాళికలతో వస్తే మా ప్రభుత్వంతో మాట్లాడి పరిష్కరించేందుకు కృషి చేస్తాను. వైసీపీ ప్రభుత్వం మాదిరిగా మాత్రం చేయం.

విజయవాడ - మచిలీపట్నం ఆరు వరసల విస్తరణ పట్ల ప్రజలు ఆందోళన చెందుతున్నారు? దీనికి మీరిచ్చే పరిష్కారం ఏమిటి?

విజయవాడ - మచిలీపట్నం జాతీయ రహదారిని ఇప్పటికే నాలుగు వరసలుగా విస్తరించారు. విజయవాడలో బెంజిసర్కిల్ నుంచి ఆటోనగర్ వరకు ఆరు వరసలకు అనుగుణంగానే ఉంది. ఇప్పటికిప్పుడు ఏమీ చెప్పలేను కానీ.. అది డీపీఆర్ పూర్తి చేసుకున్న తర్వాత ప్రజలకు నష్టం లేకుండా ఏం చేయాలన్నదానిపై ఆలోచన చేస్తాం.

అర్ధ రూపాయి ఇచ్చి.. రూపాయి భారం మోపారు..

ఈ ప్రభుత్వం పథకాల గురించి చెప్పుకుంటోంది. పథకాల కోతల వల్ల ఎందరో బాధితులుగా మారారు. పథకాల రూపంలో అర్ధరూపాయి ఇస్తే పన్నులు రూపంలో రూపాయి లాక్కుంది. చెత్త పన్ను, కరెంట్ చార్జీల పెంపు అత్యంత కీలకమైనవి. వీటి వల్ల జనం ఆగ్రహంతో రగిలిపోతున్నారు.

మీ ప్రత్యర్థి దేవినేని అవినాష్ మిమ్మల్నే టార్గెట్ చేసి విమర్శలు ఎక్కుపెడుతున్నారు? నియోజకవర్గంలో అధికారంలో లేకపోయినా సర్వీసు చేస్తున్నానని అంటున్నారు. మీరేమంటారు?

ఏం చేశాడని నేను ప్రశ్నిస్తున్నా. యూజీడీ వ్యవస్థను బాగు చేశాడా? ఇళ్లలో నీరు రోడ్ల మీదకు వస్తున్న దౌర్భాగ్యం నెలకొంది. ఈ వేసవిలో గత 20 రోజులుగా కొండ ప్రాంతాలకు మంచినీరే రావటం లేదు. మంచినీళ్లు ఇప్పించాడా? వర్షం కురిస్తే రోడ్లు మునిగిపోతున్నాయి. డ్రెయినేజీ పూడికలు తీయించాడా? మా ప్రభుత్వం విజయవాడలో అన్నీ సిమెంటు రోడ్లు వేయాలని రూ.1600 కోట్లు ఇస్తే.. సిమెంట్ రోడ్లు వేయించాడా? ఆ డబ్బులు ఏమయ్యాయో కూడా తెలియదు. రీ టెయినింగ్ వాల్‌ను మొదలు పెట్టిందే నేను. సగం రీ టెయినింగ్ వాల్ పనులు మా ప్రభుత్వ సహాయంతో నేనే చేయించాను. మిగిలిన కొద్ది భాగం పూర్తి చేయటానికి ఈ ప్రభుత్వానికి ఐదేళ్లు పట్టింది. పంటకాల్వ రోడ్డు విస్తరణ పనులను కూడా చేయించాను. ఇలా దూరదృష్టితో ఎన్నో పనులు చేశాను. నా మీద విమర్శలు ఎక్కుపెట్టినంత మాత్రాన అవన్నీ నిజమైపోవు. నేనేమిటో, తనేమిటో ప్రజలకు బాగా తెలుసు.

ఎన్నికల్లో మీ గెలుపు లెక్కలేమిటి? హ్యాట్రిక్ కొట్టబోతున్నారా?

కచ్చితంగా. ఇక్కడ పసుపు జెండా ఎగురవేయటం ఖాయం. నా వరకు 30 వేల మెజారిటీ తక్కువ రాదని అనుకుంటున్నాను. మా నాయకులు, కార్యకర్తలు అయితే 60 వేల వరకు వస్తుందని లెక్కలు వేస్తున్నారు. నేనైతే ఒకటే చెబుతున్నాను. ఈసారి రికార్డు స్థాయి మెజారిటీతో తూర్పున జెండా ఎగరవేయబోతున్నాం.

మన ఓటు... మన ఆత్మగౌరవం!

ఇందిరాగాంధీ ప్రధానమంత్రిగా ఉన్న కాలమది. మధ్యాహ్నం ఢిల్లీ రాజమార్గంలో తన కాన్వాయ్‌తో కారులో వెళ్తున్నారు. ఇంతలో దూరంగా మండుటెండలో ఆట బొమ్మలు అమ్ముకుంటున్న తొమ్మిదేళ్ల పాపపై ఇందిరాగాంధీ దృష్టి పడింది. కాళ్లకు చెప్పులు లేకుండా ఆ చిన్నారి దూది బొమ్మలు అమ్ముకుంటున్న తీరు ప్రధాని హృదయాన్ని కదిలించింది. చిన్నారిని ప్రధాని అంతటి మనిషి పిలుస్తున్నా తనను కాదనుకొని చిన్నారి ప్రతిస్పందించలేదు. తానే ఆ చిన్నారిని పలకరించేందుకు వెళ్లారు. ‘నేను అంతగా పిలుస్తున్నా పలకకుండా వెళ్లిపోతున్నావేం పాపా’ అంటూ తలపై నిమురుతూ ఆప్యాయంగా దగ్గరకు తీసుకున్నారు ప్రధాని. ‘నువ్వు ఎక్కడ ఉంటావు’ అంటూ ఆరా తీశారామె. ‘ఇంట్లో అమ్మ, అక్కయ్యలు బొమ్మలు చేసి ఇస్తే, నేను ఇలా బజారులో అమ్ముతూ ఉంటానమ్మా.. ఇంట్లో అమ్మా, నాన్న, నేను, ఇద్దరు తమ్ముళ్లు, ఇద్దరు అక్కలు, ఇద్దరు చెల్లెళ్లు. తొమ్మిది మందికి ఈ బొమ్మల నుంచి వచ్చిన ఆదాయమే ఆధారం. రోజంతా అమ్మితే రూ.20 - రూ.30 లాభం ఉంటుంది’ అని చెప్పి అమ్ముకోవడానికి వెళ్లిపోసాగింది ఆ చిన్నారి. ఆ పాప కుటుంబ ఆర్థిక స్థితిగతులు ప్రధానికి అర్థమయ్యాయి. వెంటనే తన చేతి సంచిలో నుంచి రూ.500 తీసి పాప చేతిలో ఉంచారు. ఆ పాప ప్రధాని కళ్లలోకి చూస్తూ ‘అమ్మా నేనేం.. బిచ్చగత్తెను కాను’ అంది. ఒక్కక్షణం ఆలోచనలో పడ్డారు ప్రధాని. ఆ పాప అంత సులువుగా డబ్బులు తీసుకోదని అర్థమైంది. ‘అమ్మా మా ఇంట్లో చిన్నపిల్లలు లేకపోయినా నీలాంటి చిన్న పిల్లలు చాలా మంది కలుస్తుంటారు. వారికి ఆడుకోవడానికి ఈ బొమ్మలు బహుమతిగా ఇద్దామనుకుంటున్నారు. ఇప్పటికైనా ఈ వంద రూపాయలు తీసుకొని బొమ్మలు అమ్ముతావా’ అని వంద రూపాయలు నోటు ఆ పాపకు ఇచ్చారు ప్రధాని. ఆ తొమ్మిదేళ్ల పాప ఆత్మగౌరవాన్ని ప్రధాని తన డైరీలో రాసుకోవడమే కాదు. ఎంతో మంది ప్రముఖులకు ఉదాహరణగా చెప్పేవారు. ఉచితాలను ఆశించని ఆ చిన్నారి భారతీయ ఆత్మగౌరవానికే ప్రతీక అని కొనియాడేవారు. అయాచితంగా వచ్చిన దాన్ని భారతీయలు స్వీకరించరనీ, ఒకరి దయాదాక్షిణ్యాలపై బతికే అలవాటు భారతీయులకు లేదనీ భారతీయతత్వాన్ని ఈ ఉదంతం ఎన్నికల సందర్భంగా మరోమారు గుర్తు చేస్తుంది. మన ఓటు మన ఆత్మగౌరవం. ఓటును అమ్ముకుంటే ఆత్మగౌరవాన్ని అమ్ముకున్నట్టే అని, డబ్బులు, మద్యం, తాయిలాలకు లొంగొద్దని, ఉచితాలకు ఆశపడి ఓటును వృథా చేయొద్దని తెలుపుతూ పుస్తకాలు పంపిణీ చేస్తున్నారు దేవినేని సీతారావమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు దేవినేని మధుసూదనరావు, జయశ్రీ. ఈ చిన్నారి కథనం కూడా ఈ పుస్తకంలోనిదే. ఎన్నికల సమయంలో ప్రజలు తప్పటడుగులు వేస్తుంటారని, సరైన సమయంలో సరైన వ్యక్తిని ఎన్నుకోవాలని చెబుతూ ‘ఎన్నికలు అంటే ఏమిటి? ఎందుకు అవసరం?’ అనే పుస్తకాన్ని ముద్రించి పంపిణీ చేస్తున్నామని వారు చెబుతున్నారు. ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు తమ వంతుగా ఈ ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఎవరికి కావాలన్నా ఉచితంగా పంపిస్తామని, 99890 51200 నంబరుకు సంప్రదించవచ్చు అని వారు తెలిపారు. - కంకిపాడు



ఎన్నికలు అంటే ఏమిటి? ఎందుకు అవసరం? పుస్తకం



దేవినేని మధుసూదనరావు

చట్టం కాదు ‘భూ’తం!

- భూ యాజమాన్య హక్కు చట్టం-2022పై రైతుల ఆగ్రహం

కంచికచర్ల, మే 3 : వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన ఆంధ్రప్రదేశ్ భూ యాజమాన్య హక్కు చట్టం - 2022 (ఏపీ ల్యాండ్ టైటిల్ యాక్టు) వల్ల గ్రామీణ ప్రాంత రైతుల్లో తీవ్ర అలజడి ఏర్పడింది. ఈ చట్టంపై గ్రామాల్లో ఎక్కడికక్కడ రైతుల్లో చర్చలు సాగుతున్నాయి. తరతరాలుగా తమ కుటుంబాలకు ఆధారంగా ఉంటున్న భూములపై వారసత్వంగా వస్తున్న హక్కులను కాలరాయటం పట్ల ఆందోళన చెందుతున్న రైతులు, దుర్మార్గంగా వ్యవహరిస్తున్న వైసీపీ పాలకులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎంతో పటిష్టంగా ఉన్న ఆర్ఓఆర్ - 1971 (రికార్డ్స్ ఆఫ్ రైట్స్) చట్టాన్ని ఎందుకు మార్చాల్సి వచ్చిందని ప్రశ్నిస్తున్నారు.

చట్టాన్ని రద్దుచేయాలి



రైతుల హక్కులను హరించేలా వైసీపీ తెచ్చిన భూ యాజమాన్య హక్కు చట్టం -2022ను తక్షణమే రద్దు చేయాలి. రైతుల జీవితాలతో ఆటలాడుకునే దుర్మార్గపు చట్టాన్ని ఎట్టి పరిస్థితుల్లో కూడా ఉపేక్షించకూడదు. జగన్ బొమ్మలతో ఉన్న పట్టాదారు పాస్‌పుస్తకాలను రద్దు చేసి, ప్రభుత్వ ఖర్చుతో రైతులకు కొత్త పుస్తకాలు ఇవ్వాలి. సర్వే రాళ్లు కూడా తొలగించి, కొత్త రాళ్లు వేయాలి.

- మాగంటి నరసింహారావు (బాబు), రైతు నాయకుడు, నక్కలంపేట

ఆర్ఓఆర్ ప్రకారమే పాస్‌పుస్తకాలివ్వాలి



ఆర్ఓఆర్ చట్టం ప్రకారమే రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలు ఇవ్వాలి. రైతుల ఆస్తులకు చెందిన ఈ పుస్తకాలపై జగన్ బొమ్మలు ముద్రించటం దారుణం. పైగా రెవెన్యూ రికార్డుల వివరాలను ఒక ప్రైవేట్ సంస్థకు అప్పగించటం వల్ల ఆస్తుల భద్రతకు రక్షణ లేకుండా పోయింది. ఆస్తులను కొల్లగొట్టడం కోసమే వైసీపీ పెద్దలు ఒక పథకం ప్రకారం ల్యాండ్ టైటిల్ యాక్టును తీసుకువచ్చారు.

- దిగుమర్తి శ్రీనివాసరావు, లింగాలపాడు

రైతుల హక్కులకు భంగం



వైసీపీ తెచ్చిన ల్యాండ్ టైటిల్ చట్టం 2022 వల్ల రైతుల హక్కులకు భంగం కలుగుతుంది. భూ వివాదాలేర్పడినపుడు సివిల్ కోర్టులను ఆశ్రయించటానికి వీలు లేకుండా చేసి, న్యాయానికి సంకెళ్లు వేస్తున్నారు. న్యాయం కోసం కోర్టులకు వెళ్లకుండా బాధితులు పాలకులు, అధికారుల చుట్టూ ప్రదక్షిణాలు చేయాల్సి ఉంటుంది. జిరాక్స్ రిజిస్ట్రేషన్ల వల్ల ఆస్తుల వివాదాలు ఎక్కువగా వచ్చే ప్రమాదం ఉంది.

- అత్తులూరి భూపతిరావు, పరిటాల

గత ఎన్నికల ప్రచారంలో..

తోట్లవల్లూరు మండలంలో టీడీపీ నేతలు ఇసుకను దోచుకుతింటున్నారు. నేను అధికారంలోకి వస్తే అవినీతిని అరికడతా. ఇసుకను పారదర్శకంగా ప్రజలకు అందిస్తా.

- ప్రతిపక్ష నేతగా 2019 పాదయాత్రలో పామర్రు వచ్చినప్పుడు జగన్ చెప్పిన మాటలివి.

వైసీపీ అధికారంలోకొచ్చాక..

ఇసుక అక్రమ తవ్వకాలకు అంతులేదు. అమ్మకాలకు అడ్డులేదు. వైసీపీ నేతలు దోచుకుతినేటట్టు చేశారు. ఇసుక ధరను భారీగా పెంచేశారు. సామాన్యుడికి ఇసుక ధర అందనంత ఎత్తుకు తీసుకెళ్లారు. క్వారీల్లో యంత్రాలను ప్రవేశపెట్టి ఇసుక క్వారీలపైనే ఆధారపడిన 5వేల మంది కార్మికుల జీవనోపాధిని దెబ్బతీశారు.


టీడీపీ హయాంలో ఉచిత ఇసుక పథకంలో ట్రాక్టర్లకు ఇసుక లోడింగ్ చేస్తున్న కార్మికులు (ఫైల్)


వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత ఉచిత ఇసుక పథకాన్ని రద్దు చేసి కేవలం యంత్రాలతోనే చేస్తున్న ఇసుక లోడింగ్ (ఫైల్)

ఇసుక కార్మికుల కడుపు కోత

- టీడీపీ ప్రభుత్వంలో ఉచితంగా ఇసుక
- లోడింగ్‌తో కార్మికులకు ఉపాధి
- రోజుకి రూ.1,500 కార్మికుల సంపాదన
- రోజూ 2వేల మందికి ఉపాధి
- వైసీపీ ప్రభుత్వంలో యంత్రాలతోనే ఇసుక లోడింగ్
- క్వారీలకు పూర్తిగా దూరమైన కార్మికులు

తోట్లవల్లూరు : టీడీపీ ప్రభుత్వంలో ఉచిత పథకంలో తోట్లవల్లూరు నుంచి ఒక ట్రాక్టర్ ఇసుకను ఉయ్యూరు తీసుకెళ్లి రూ.1,500కు విక్రయించేవారు. వినియోగదారులకు చాలా తక్కువ ధరకు లభించటంతో నిరుపేదలు సైతం భవన నిర్మాణాలు సాగించేవారు. జగన్ పాలనలో ట్రాక్టర్లకు ఇసుక పోయటం ఆపేసి పదిటైర్ల లారీల్లో యంత్రాలతో లోడింగ్ చేయిస్తున్నారు. దీంతో అదే ట్రాక్టర్ ఇసుక ఉయ్యూరులో కొనాలంటే బ్లాక్‌లో రూ.7 వేల నుంచి రూ.8 వేల వరకు ముట్టజెప్పాల్సి వస్తోంది. ఇసుక రవాణా అవకాశం లేక పోవటంతో కిస్తీలు కట్టలేక చాలామంది ట్రాక్టర్లను అమ్మేసుకున్నారు.

టీడీపీ హయాంలో కార్మికులకు మేలు



టీడీపీ ప్రభుత్వం అమలు చేసిన ఉచిత ఇసుక పథకంలో 2019 మే వరకు మూడు టన్నుల ఇసుకను రూ.300కు కార్మికులు ట్రాక్టర్‌లోకి లోడింగ్ చేసేవారు. తోట్లవల్లూరు మండలం నుండే కాకుండా ఉయ్యూరు, పామర్రు, కంకిపాడు, మచిలీపట్నం, పమిడిముక్కల, మొవ్వ తదితర మండలాల నుంచి రోజూ 2వేల మంది కార్మికులు తోట్లవల్లూరు వచ్చి ట్రాక్టర్లకు ఇసుక లోడింగ్ చేసేవారు. రోజుకి రూ.1,500 నుంచి రూ.2వేల వరకు సంపాదించుకునేవారు. ఇలా ఒక కార్మికుడు నెలలో 15 రోజులు పనిచేసి నెలకు రూ.30 వేల వరకు సంపాదించుకునేవారు.

జగన్ పాలనలో యంత్రాలతోనే పనులు



వైసీపీ ప్రభుత్వం వచ్చాక సీఎం జగన్ తాను ప్రతిపక్షనేతగా ప్రజలకు ఇచ్చిన వాగ్దానాన్ని తుంగలోతొక్కి, కొత్త పాలసీ పేరుతో ఉచిత ఇసుక పథకాన్ని రద్దు చేశారు. కొత్త పాలసీలో సొంత ఏజెన్సీలకు ఇసుకను అప్పగించి టన్ను ఇసుకకు రూ.450 ధరను నిర్ణయించి యంత్రాలతోనే లోడింగ్ జరిగేటట్టు చేశారు. దీంతో వేలాది మంది కార్మికుల కడుపుమీద దెబ్బకొట్టినట్టయింది. క్వారీల్లో ఇసుక లోడింగ్ జీవనోపాధి కల్పించాలని కార్మికులు అనేకసార్లు అధికారులకు వినతిపత్రాలు అర్పించినా ప్రభుత్వం పెడచెవిన పెట్టింది. మాట తప్పం మడమ తిప్పం అంటు గొప్పలు చెప్పుకునే సీఎం జగన్ ఇసుక విషయంలో మాటతప్పి మడమ తిప్పారు.

కార్మికులు తీవ్రంగా నష్టపోయారు



జగన్ పాలనలో ఇసుక కార్మికులు తీవ్రంగా నష్టపోయారు. కేవలం ఇసుక పని తప్ప మరో పని చేతగాని వందలమంది కార్మికులు ఎన్నో ఆర్థిక ఇబ్బందులకు గురికావలసి వచ్చింది. ఇసుక లోడింగ్ పనితో ప్రతిరోజూ రూ.1,500 వరకు ఒక వ్యక్తి సంపాదించుకునేవాడు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు.

- ఉయ్యూరు చిట్టిబాబు, ఇసుక కార్మికుడు, తోట్లవల్లూరు

ప్రభుత్వ క్వారీ తెరుస్తామన్న హామీ నెరవేరలేదు



ప్రభుత్వ ఇసుక క్వారీ తెరిపించి కార్మికులకు ఉపాధి కల్పిస్తామని గతంలో జాయింట్ కలెక్టర్ మాధవీలత రొయ్యూరు కార్మికులకు హామీ ఇచ్చారు. కానీ ప్రభుత్వ విధానంతో ప్రభుత్వ క్వారీలు తెరవలేదు. ప్రభుత్వం ప్రైవేటు వ్యాపారస్తులకు క్వారీలను అప్పగించటంతో వేలాదిమంది కార్మికులకు ఉపాధి లేకుండా పోయింది.

- బందెల కోటేశ్వరరావు, ఇసుక కార్మికుడు, రొయ్యూరు